ఆదివారం
ప్రజాశక్తి
జూలై 27, 2003



మాటల కోటలు - అర్థాల మూటలు

హ్యాపీ బర్త్‌డే

(27-7-2003నుండి
2-8-2003వరకు)

సప్తగిరి
1సం॥, 27-7-2002
అనసూయ-లక్ష్మీనారాయణ
పాపిరెడ్డిపల్లి-అనంతపురం

వై. సంజయ్‌బాబు
7సం॥, జులై-1996
విజయలక్ష్మి-సురేష్
అశోక్‌నగర్-హైదరాబాద్

మింటు
1సం॥, 25-7-2002
వాసవి-వేణుగోపాల్
కాజీపేట-వరంగల్

జి.ఎం.బాబు
5సం॥, 29- 7-1998
సునీత-జయచందర్
శంకర్‌పల్లి-రంగారెడ్డి

తేజశ్రీ
3సం॥, జులై-2000
సునీత-జయచందర్
శంకర్‌పల్లి-రంగారెడ్డి

గౌసియాబేగం
జులై-27
షమీమ్‌ఫాతిమా-యాకుబ్‌పాషా
రంగంపేట-వరంగల్

కె. శ్రీకాంత్
4సం॥, 29-7-1999
సుజాత-ముకుందం
చందిప్ప-రంగారెడ్డి

షేక్ మదార్‌బి
2॥సం, 27-7-2001
షేక్ హానిషా-షేక్ మదాక్ వలి
గిద్దలూరు- ప్రకాశం

సిహెచ్- మానససాయి
8సం॥, 31.7.1995
శారద-లక్ష్మీనరసింహం
పాదిలి- ప్రకాశం

టి.ఆర్. చాందిని
9సం॥ 2.8.1994
శోభన-రమేష్
అరండల్‌పేట- గుంటూరు

కె.పి. సుందరయ్య
2సం॥ 2-8- 2001
కోటేశ్వరి- వెంకటేశ్వరరావు
దుర్గాపురం-విజయవాడ

పి. సతీష్
4సం॥, 2-8-1999
కృష్ణవేణి- నరసింహారావు
అన్నపూర్ణమ్మపేట-రాజమండ్రి

కె. మౌనిక
7సం॥, జులై-1996
లీలావతి- అంజిరెడ్డి
అశోక్‌నగర్- హైదరాబాద్

ఎస్.బి.కాషిఫ్
యాస్మీన్ బేగం- లతీఫ్
నలసఫ్‌గడ్డ-మెదక్

మనలో మాట

జయహో... జయహో..

రాజుగారు సభా మందిరంలోకి అడుగు పెట్టే ముందు - వంది మాగదులు జండా కర్రలూపుకుంటూ వస్తారు!

శ్రీశ్రీశ్రీ ఫలానా ప్రభువుల వారు వేం చేస్తున్నారని ప్రకటిస్తారు.

అక్కడితో వదిలి పెట్టరు!

శ్రీవారి బయోడేటా మొత్తం దండకం బాణీలో వినిపిస్తారు!

రాజాధిరాజా అంటారు. రాజ మార్తాండ అంటారు. రాజకంఠీరవ అని కూడా అంటారు. కంఠీరవకి మీనింగు తెలీదేమో నన్న డవుటుతో - రాజసింహ అని మామూలు భాషలో కూడా అంటారు!

ఈ బిరుదులూ ఉపమానాలూ పూర్తయిన తర్వాత -

శ్రీవారి లక్షణాలూ గుణగణాలూ అందచందాలూ అనేకం అందంగా చెబుతారు!

ఆ తర్వాత-

శ్రీవారి కీర్తి చంద్రికలు తాలూకు ముచ్చట్లుకొన్ని ముచ్చటిస్తారు.

ప్రభువుల వారి ప్రతాపం తారా స్థాయిలో వెలుగుతుందంటారు. ఆ తాకిడికి తట్టుకోలేక ముదినేపల్లి రాజా మూటాముల్లె సర్దుకుపోయేరంటారు! తలకోన కింగు తలొంచేసేరని చెబుతారు!

దాచేపల్లి ఏలిక తమ ఏకైక పుత్రికారత్నాన్ని ప్రభువుల వారికి సమర్పించుకుని బతికి పోయేరంటారు!

మదపుటేనుగుల్ని ఎగిరి తన్ని మట్టిలో కలిపిన వైనం - శ్రీవారి బల సంపదకు చక్కటి తార్కాణం అంటారు!

సింహాలూ పులులూ శ్రీవారిని కలలో దర్శనం చేసుకుని, గుండెపోటు తెచ్చుకుని కన్ను మూసేయని ప్రకటిస్తారు!

ఈ ప్రకటనలు విన్న తర్వాత - సభికులు యావన్మందీ అమ్మో అనుకుంటారు. తేడాలొస్తే పుట్టగతులుండవని వణికి ఛస్తారు! ఒళ్ళు దగ్గిరెట్టుకుని జాగ్రత్త పడాలని ఒట్టేసుకుంటారు!

అప్పుడు గాని శ్రీవారు సభలోకి అడుగు పెట్టరు!

భట్రాజులు చదివిన ప్రభువుల కీర్తిచంద్రికలు సభలో వున్న వారికి హెచ్చరికల్లాగా వినిపిస్తాయి!

అందువల్ల-

ఆ సభలో శ్రీవారు పరమ బూతులు మాటాడినా - పవిత్రమైన నీతుల్లాగా సభికులకు వినిపిస్తాయి! అందువల్ల జయహో జయహో అని అరుస్తూ తరిస్తారు!

ఇదేదో రాజుల కాలం నాటి రభస అని భ్రమిస్తే కళ్ళు పోతాయి. ఆనాటి తంతు అక్షరాలా ఈనాటి ప్రభువుల హయాంలో కూడా కొనసాగుతోంది!

ఈ సంచికలో . . .

కార్టూన్ కదంబం	. . . 2
కవర్‌స్టోరీ	. . . 3
ఆరోగ్యం	. . . 6
జీవనశైలి	. . . 8
గేయలహరి	. . . 9
బాలల కథ	. . . 11
బాలనేస్తాలు	. . . 12
కచేరి	. . . 14
టూరిస్ట్‌గైడ్	. . . 16
క్రీడారంగం	. . . 17
పుస్తక పరిచయం	. . . 20
రియల్ స్టోరీ	. . . 22
పలుకుబడి	24

వగైరా . . . .

ఇంకా...



సృజనాత్మకతను పెంచాలి

బాలవికాసం . . . 10

మహామేధావి...

'ఇంతి' సంగతులు . . . 15

చిరుగు వస్త్రం

కథ . . . 18, 19

మూఢనమ్మకాలపైనే నా గురి

కళాసాహితి . . . 21

గోదావరి పుష్కర స్నానం చేస్తే పాపాలన్నీ పోతాయట సార్!!
కోటివరాలు
పుష్కరాలు
గంగాధర్..

కార్టూన్ కదంబం


విహెచ్‌పి
ఆర్‌ఎస్‌ఎస్
వాజ్‌పేయి అద్వానీ తదితరులకు బాబ్రీతో సంబంధం లేదు సిబిఐ కితాబు

'మొన్న'
అద్వానీ లోహపురుష్!
తమరు.. అదృశ్య పురుషా?
నేను!!
ఎన్నికల తర్వాత బిజెపి అధ్యక్షునిగా అద్వానీ ???

✻ తాతా శ్రీనివాసరావు

మాటల కోటలు అర్థాల మూటలు



నిఘంటువు...!
నిగూఢ విజ్ఞాన ఖని...!!
అంతులేని పదాల సమూహం...!!!
విజ్ఞానం ఓ తీరని
దాహం...అన్నారు
మహానుభావులు...
అవును! విజ్ఞానానికి అంతేలేదు.
తెలుసుకోవాలన్న అన్వేషణే
సరికొత్త ఆవిష్కరణలకు మూలం.
అద్భుత ఆధునిక సమాజ
నిర్మాణానికి పునాది... భాష.

ప్రతి భాషలోనూ లక్షల సంఖ్యలో పదాలు ఉంటాయి. వీటన్నింటికీ అర్థాలు, వివరణలు అందరికీ తెలియవు. నిఘంటువు అంటేనే 'అర్థంచెప్పేది' అని. డిక్షన్ అనే పదం నుండి డిక్షనరి వచ్చింది. డిక్షన్ అంటే పద సరళి అని అర్థం. పదాలకు ఉన్న వివిధ అర్థాలు, పదాల కలయిక, ఉచ్చారణ తీరు, నామవాచకం, సర్వనామం, క్రియ, క్రియా విశేషణం, విశేషణం పదాల గుణాలను, ప్రయోగంలో మారే తీరు ఇలా అనేక అంశాలను మనం నిఘంటువులో తెలుసుకోగలం. భాష నిరంతరం మారుతుంది. అనేక కొత్త పదాలు చేరుతుంటాయి. పాత పదాలు చెరిగిపోతుంటాయి. కొన్ని పదాలకు అర్థాలు మారుతుంటాయి. ఒక భాషలో వచ్చే కొత్త పదానికి మరో భాషలో ఒకపట్టాన అర్థం లభించదు. దీనికి సరైన పదాన్ని ఆయా భాషల్లో అభివృద్ధి చేయడానికి కొంత కాలం పడుతుంది. కొన్ని పదాలు వాడుకలో స్థిరపడిపోతాయి. ఇలా స్థిరపడి చివరకు ఇటీవల ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులోకి సైతం ఎక్కిన పదం 'బాలీవుడ్'. హిందీ చిత్ర పరిశ్రమను టూకీగా బాలీవుడ్ పేరుతో వ్యవహరించేవారు.

తెలుగులో అనేక మహాకావ్యాలు వున్నాయి. తేటతియ్యని తెలుగు భాషగా గుర్తింపు పొందింది. అనేక సంస్కృత పదాలు తెలుగులో వాడుకలోకి వచ్చి స్థిరపడ్డాయి. పదాలు పండితులకు తప్ప ఇతరులకు అర్థం అయ్యేవికావు. చదువుతున్న వారికి పదాలు అర్థం కాకుంటే చదివేది తలకెక్కదు. పుస్తకం భారంగా మారుతుంది. భాష ఏదైనా ఈ సమస్య ఉంటుంది. ఏదో సినిమా చూస్తూ ఉంటే మధ్యలో ఒక పాత్రధారి కొత్తపదాన్ని ఉపయోగిస్తాడు. అంతే ఆ పదానికి అర్థం ఏమిటో తెలుసుకునేదాకా మనసు కుదుటపడదు. అనేక పదాలు ఇలా నిత్యం వస్తూనే ఉంటాయి. వాటికి అర్థాలు తెలుసుకోవడానికి ఉన్న ఏకైక మార్గం నిఘంటువు. పదాల సమూహం. ప్రస్తుతం మార్కెట్‌లో 75 రూపాయల నుండి లక్ష రూపాయల వరకు ఖరీదైన నిఘంటువులు లభిస్తున్నాయి.

తెలుగులో నిఘంటువు అన్న పదం వాడుకలోకి రాకపూర్వమే ఇందుకు కొంత ప్రయత్నం జరిగింది. పదాలను వరసగా రాసి వాటి అర్థాలను వివరించారు. 'నామకోశం', 'పదకోశం' పేరుతో ఇలాంటి పదాలకు అర్థాలను వరుసగా రాశారు. సంస్కృతంలో అమరకోశం, తెలుగులో ఆంధ్రనామ సంగ్రహం వంటివి ఇందుకు ఉదాహరణలు. కడప జిల్లాలో పని చేసిన బ్రిటిష్ అధికారి సాహిత్యాభిమాని సి.పి బ్రౌన్ తెలుగులో నిఘంటువు లేని లోటును గుర్తించారు. తెలుగులో ఉన్న అనేక పదాలకు అర్థాలను ఒకచోట నిక్షిప్తం చేయాలన్న ఆయన బృహత్తర ఆశయం నెరవేరి తెలుగులో నేటికీ ఒక ప్రామాణిక నిఘంటువుగా పండితుల మన్ననలను పొందుతున్నది. తెలుగు అకాడమీ పునర్ముద్రించిన శ్రీసూర్యరాయాంధ్ర నిఘంటువు, శబ్దరత్నాకరం కూడా తెలుగులో ఉన్న మంచి నిఘంటువులు. తెలుగు సాహిత్యం ఎంతో అభివృద్ధి చెందినా ఆ మేరకు నిఘంటువు సంఖ్య పెరగకపోవడం లోటుగానే ఉంది. ఇప్పుడు గ్లోబలైజేషన్ వేగంలో మన భాష మరింతగా ధ్వంసం అవుతున్నది.

ఎన్నెన్ని రకాలు!

హైదరాబాదు చిక్కడ పల్లిలో పాఠకులకు మరింత చేరువగా వచ్చిన ప్రజాశక్తి బుక్‌హౌస్ వరుసగా నిర్వహిస్తున్న పుస్తక ఎగ్జిబిషన్లు చదువరులను ఎంతగానో ఆకట్టుకుంటున్నాయి. పిల్లల ఎగ్జిబిషన్, ఆక్స్‌ఫర్డ్ ఎగ్జిబిషన్‌ల తర్వాత ఏర్పాటు చేసిన డిక్షనరీ మేళా ఒక వినూత్న ప్రయత్నంగా, ప్రయోగంగా అందరి అభినందనలు పొందింది. ఈ మేళాలో పుస్తకాల వైవిధ్యం ఊహించలేనంత స్థాయిలో వుంది. ఏదైనా పదం తెలియకపోతే తాత్కాలిక అవసరంగా మాత్రమే చాలా మంది చూసే డిక్షనరీలకు ఇంత పరిధి వుందా అని ఆశ్చర్యం కలుగుతుంది. వాస్తవానికి నిఘంటువులు మాత్రమే కాక రకరకాలైన పదకోశాలు కూడా దీనిలో వున్నాయి.

30 మంది ప్రచురణ కర్తలు వేసిన 600 పైగా నిఘంటువులు, భాషా కోశాలు, విజ్ఞాన సర్వస్వాలు చూస్తే ప్రపంచ భాషల సుసంపన్నత అర్థమవుతుంది.

మార్కెటింగ్, బిజినెస్, సోషియాలజీ, బయాలజీ సైకాలజీ, మెడిసిన్, ఆర్కిటెక్చర్, కలలు, కళలు వంటి వివిధ విషయాలకు సంబంధించిన వేర్వేరు నిఘంటువులు, కోశాలు లభిస్తాయి. పిల్లల కోసం బాల నిఘంటువులు, పరిణితుల కోసం ప్రౌఢ నిఘంటువులు(అడ్వాన్స్‌డు) కూడా వున్నాయి. స్కూలు, కాలేజీ విద్యార్థుల కోసం వేర్వేరుగా వున్నాయి. లివింగ్ లాంగ్వేజ్ సీరీస్‌లో రాండమ్‌హౌస్ ప్రచురించిన వాటిలో ఇంగ్లీషు మాత్రమే కాక స్పానిష్, జర్మన్, రష్యన్, పోర్చుగీస్, జపానీస్, తదితర భాషలన్నిటి గురించిన పుస్తకాలున్నాయి. మామూలుగా అంతగా తెలియని సింహళి, ఎస్కిమో, మాల్దీవియన్, బర్మీస్ తదితర భాషలలో కూడా వున్నాయి. ప్రాచీన భారతీయ భాషలైన పాళీ, సంస్కృతం కూడా వున్నాయి.

భారతీయ భాషల సామెతలను, ప్రయోగాలను పరిచయం చేసే పుస్తకాలు అనేకం వున్నాయి. ఆసియా ఎడ్యుకేషన్ సొసైటీ ప్రచురించిన ఈ పుస్తకాలలో వాటిని వివరించడమే కాక వివిధ దక్షిణాది భాషల మధ్య వ్యాకరణం ఆచారాల పోలికలు, తేడాలు చూపేవి ప్రత్యేక ఆసక్తి కలిగిస్తాయి. ఉర్దూ, హిందూస్థానీ, అరబిక్ భాషల నిఘంటువులు వున్నాయి. తెలుగు మాటలుగా ఉపయోగిస్తున్న పదాల వెనుక ఇతర భాషల ప్రభావం చెప్పే నిఘంటువు వుంది.

వయసు మళ్లి చూపు మందగించిన వారి కోసం బిగ్‌టైప్ డిక్షనరీలు పెద్ద అక్షరాలతో వున్నాయి. అలాగే రకరకాల బొమ్మల నిఘంటువులున్నాయి. అనువాదాలకు సంబంధించిన డిక్షనరీలున్నాయి.

శాస్త్రజ్ఞులకు సంబంధించిన నిఘంటువు, సాహిత్య కారుల నిఘంటువు వంటివి, జీవిత చరిత్రల నిఘంటువు ఇంకో రకానికి చెందినవి. అలాగే అమెరికన్ ఇంగ్లీషు, ఇండియన్ ఇంగ్లీషు అంటూ వేర్వేరుగా వున్నాయి. తేదీల వారీగా వుండేవి మరికొన్ని.



భాషా పరంగా ఉచ్చారణను తెలిపేవి, పదప్రయోగాన్ని వివరించేవి, రకరకాల పదసముదాయాలను అందించేవి(థెసర్స్), రకరకాల రంగాలకు సంబంధించిన పదాలను కలిపి వాడకానికి అనుకూలంగా ఇచ్చేవి, మారుతున్న కాలంలో పదాల మార్పులను చెప్పేవి కూడా వున్నాయి. తెలుగులో చెప్పే నానార్థాలు, పర్యాయ పదాల నిఘంటువులు ఇంగ్లీషులో లెక్కకు మిక్కుటంగా వున్నాయి. ఇంగ్లీషు ఇంటి పేర్ల నిఘంటువు ఒకటి. సమకాలీన పదాల మార్పులను చెప్పేది ఇంకోటి.

డిక్షనరీ ఆఫ్ మ్యూజిక్‌లో మన తబలా, మృదంగం బొమ్మలతో సహా దేశదేశా ల సంగీత పరికరాల పదాల వివరాలున్నాయి.

తెలుగు భాషకు సంబంధించి బ్రౌన్ నిఘంటువు, శంకరనారాయణ నిఘంటువు పాతకాలానివి. తెలుగు నుంచి తెలుగుకు అర్థాలిచ్చేవి తక్కువగానే వచ్చాయి. శబ్దార్థ చంద్రిక వంటి వాటిలోని పదాలు, అర్థాలు చాలా మారిపోయాయి. తెలుగు అకాడమీ ప్రచురించిందే ఇప్పుడు ప్రముఖంగా చలామణిలో వుంది.

మానవ సమాజ చరిత్రలో భాషకున్న ప్రాముఖ్యత సాటిలేనిది. భాష సంస్కృతిని, నాగరికతను ప్రతిబింబించుతుంది. జీవన పోరాటంలో భాష ఒక ఆయుధం అని మార్క్స్ అనేవారు. వ్యక్తీకరణ, వ్యక్తిత్వం , ఆలోచన అన్నీ భాష ద్వారానే జరుగుతాయి. దేశ దేశాల ఈ నిఘంటువులు పరిశీలిస్తే భాషలు, సమాజాలు మారిపోయిన, మారిపోతున్న తీరు కూడా పూసల్లో దారంలా గోచరిస్తుంది. పదాల వినియోగం, అర్థాలు, ప్రాధాన్యతలు కూడా చరిత్ర క్రమంలో మారిపోయిన సత్యం సాక్షాత్కరిస్తుంది.భాషా వినియోగం యథాలాపంగా గాక లోతుగా అధ్యయనం చేయవలసిన అంశమని అర్థమవుతుంది. ఆ విధంగా నిఘంటు మేళా ఒక గొప్ప అనుభవం, అనుభూతి అని చెప్పొచ్చు.

ఇంగ్లీష్‌లో అతిపురాతనమైన నిఘంటువు 'ఆక్స్‌ఫర్డ్' ప్రెస్ ప్రచురిస్తున్నదే. ప్రపంచవ్యాపితంగా ఎక్కువ మంది ఆక్స్‌ఫర్డ్ నిఘంటువును ప్రామాణికమైనదిగా అంగీకరిస్తున్నారు. నిఘంటువులు అక్షర క్రమంలో తయారు చేయడం వల్ల వాటిని ఉపయోగించుకోవడం తేలిక. నేడు అనేక రకాల, రంగాల వారీగా, సబ్జెక్ట్‌వారీగా నిఘంటువులు వచ్చాయి. భాష ఏదైనా భావాన్ని వ్యక్తం చేయడం ద్వారా సమాజాల మధ్య, మనుషుల మధ్య అనుబంధాన్ని, అనురాగాన్ని పెంచింది. భాష నాగరికతకు పునాది. భిన్న నాగరికతలు, సంస్కృతుల మధ్య వారధులు నిర్మించింది భాష.

చిన్నా, పెద్దా కలిపి ప్రపంచంలో మూడు వేలకు పైగా భాషలు ఉన్నాయని అంచనా. రికార్డ్‌లకు ఎక్కని స్థానిక గిరిజన భాషలు ఇంతకు రెట్టింపు ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు. విభిన్న సంస్కృతులు, భాషలు, ఆచార సంప్రదాయాలు కలిగిన ప్రజలను సంఘటితంగా, ఐక్యంగా ఉంచడం కత్తిమీద సాములాంటిది. అన్ని భాషలకు తగిన గౌరవం లభించినప్పుడే వసుధైక కుటుంబం ఏర్పడుతుంది. ఆయా సమాజాలు సరైన దిశలో, సరైన రీతిలో సవ్యంగా అభివృద్ధిని సాధిస్తాయి.

భాష అభివృద్ధి చెంది, ముద్రణ చేసే విజ్ఞానం అందుబాటులోకి వచ్చిన తరువాత విజ్ఞానం ఎల్లలు లేకుండా ప్రవహించడం మొదలైంది. దీనితో పాటే డబ్బు సరిహద్దులను చెరిపేసింది. ఎక్కడ ఎక్కువ లాభం ఉంటే అక్కడికి విజ్ఞానంతో పాటే డబ్బు ప్రవహించింది. కొత్త ఆవిష్కరణలు జరిగాయి. సరికొత్త యంత్రాలు వచ్చాయి. కొత్త అవసరాలు వచ్చాయి. కొత్త సమాజం జీవం పోసుకుంది. దీనితో పాటే సరికొత్త మానవ సంబంధాలు ఏర్పడ్డాయి. వేగంగా జరిగిన ఈ మార్పులకు అనుగుణంగా 'భాష'లోనూ మార్పులు వచ్చాయి. అనేక కొత్త పదాలు పుట్టుకు వచ్చాయి. జరిగే ప్రతి మార్పును, అభివృద్ధిని, సరికొత్త విధ్వంసాలను తెలియచెప్పడానికి భాషలో కొత్త పదాలు వచ్చాయి. కొత్త అక్షరాలు వచ్చాయి. ఉచ్చారణ మారింది. భాష స్వరూపమే మారడం మొదలైంది. కొత్త పదాలను ఇతర ప్రాంతాల ప్రజలకు పరిచయం చేయడం అవసరమైంది. భాష వ్యాప్తి ఇందుకు దోహదం చేసింది. నాగరికత ఎల్లలులేకుండా విస్తరించడం వల్ల భాషలు విస్తరించాయి. స్థానికంగా ఉంటే భాషతో కొత్తగా వచ్చిన భాషలోని పదాలు అనేకం కలిసిపోయాయి. స్థానిక భాషలోని పదాలు కొన్ని కొత్త భాషలో ఇమిడిపోయాయి. ఇలా శాఖోప శాఖలుగా విస్తరించిన భాషలలోని పదాలకు అర్థాలు వెతుక్కోవడం తలకుమించిన భారంగా మారింది. సరిగ్గా ఈ అవసరాలను తీర్చడానికి ఆవిర్భవించిందే.

'నిఘంటువు'.

యూరప్‌లో 19వ శతాబ్దంలో వచ్చిన పారిశ్రామిక విప్లవం అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ పెను మార్పులకు దారితీసింది. కొత్త యంత్రాలను కనుగొనడం వల్ల ఉత్పత్తి భారీగా పెరిగింది. పెరిగిన ఉత్పత్తిని అమ్ముకోవడానికి మార్కెట్ల అవసరం ఏర్పడింది. దీనితో కొత్త ప్రాంతాల అన్వేషణ ప్రారంభించారు. ఇలా అనేక కొత్త ప్రాంతాలకు యూరప్ పాలకులు విస్తరించారు. పోర్చుగీస్, డచ్, ఇంగ్లీష్ ఇలా పలు భిన్నమైన భాషలు, సంస్కృతులు ఉన్న వారు ప్రపంచమంతా వ్యాపారం నిమిత్తం విస్తరించారు. వ్యాపారంతో పాటు కాలక్రమంలో ఆయా దేశాలపై రాజకీయ పెత్తనాన్ని కూడా సాధించిన వీరికి స్థానిక ప్రజలతో వ్యవహారాలు నడపాల్సిన అవసరం ఏర్పడింది. దీన్ని తీర్చడం కోసం స్థానికులకు వారి భాషను, ఆచార

వ్యవహారాలను నేర్పించారు. అప్పటికే అక్కడ ఉన్న స్థానిక భాషలపై క్రమంగా ఇంగ్లీష్, స్పానిష్, డచ్ భాషలు అధిక్యతను సాధించాయి. చివరకు ప్రపంచంలో మూడో వంతు ప్రాంతాన్ని తన పాదాక్రాంతం చేసుకున్న బ్రిటన్ అన్ని విభాగాల్లోనూ పూర్తి స్థాయి ఆధిపత్యాన్ని సాధించింది. బ్రిటిష్ పాలకులతో నిత్య సంబంధాలు, పాలన, ఆర్థిక వ్యవహారాలను నడిపేందుకు స్థానికులకు ఇంగ్లీష్‌ను ఆశ్రయించక తప్పలేదు. బ్రిటిష్ వలసవాదంతో పాటు, 20వ శతాబ్దంలో ఉచ్ఛ దశకు చేరుకున్న అమెరికా పెట్టుబడిదారీ విధానం, టెక్నాలజీ అభివృద్ధి వల్ల ప్రపంచంపై ఇంగ్లీష్ ప్రభావం గణనీయంగా పెరిగింది. ఈ రెండు ప్రధాన కారణాల మూలంగా ప్రపంచంలో మూడో వంతు దేశాల్లో ఇంగ్లీష్ రెండో భాషగా అధికారికంగానూ, అనధికారికంగానూ గుర్తింపు పొందింది. ఇప్పుడు ప్రపంచ ప్రజల అనుసంధాన భాషగా ఇంగ్లీష్ పూర్తిగా స్థిరపడిపోయింది. 21వ శతాబ్దంలో సమాచార, సాంకేతిక పరిజ్ఞానం, కంప్యూటర్ల వాడకం విస్తృతంగా పెరగడంతో ఇంగ్లీష్ అన్ని ప్రాంతీయ, జాతీయ భాషలను తిరుగులేని విధంగా ధ్వంసం చేస్తున్నది.

నేడు ప్రపంచంలో అత్యధిక మంది మాట్లాడుతున్న భాషల్లో చైనీస్ తరువాత రెండో స్థానంలో ఇంగ్లీష్ వుంది. నేడు ప్రపంచంలో 43 కోట్ల మందికి పైగా ఇంగ్లీష్‌ను మాతృ భాషగా కలిగి ఉన్నారు. 75 దేశాల్లో అధికార భాషగానూ, అధికార గుర్తింపు పొందిన రెండో భాషగాను ఇంగ్లీష్ ఉంది. ఇందులో కేవలం ఏడు దేశాలు మాత్రమే ఇంగ్లీష్‌ను మాతృ భాషగా కలిగి ఉన్నాయి. మాతృ భాషకాకుండా ఇంగ్లీష్ మాట్లాడుతున్న వారి సంఖ్య 75 కోట్లకు పైగా ఉంది. అయితే ఈ సంఖ్యపై స్పష్టమైన వివరాలు మాత్రం లేవు. పారిశ్రామిక అభివృద్ధి మూలంగా ప్రపంచవ్యాపితంగా వలసలు పెరిగాయి. ఇలా వలస వచ్చిన వారు తప్పనిసరిగా ఇంగ్లీష్ నేర్చుకోవాల్సి వచ్చింది. పెరుగుతున్న అవసరాలను తీర్చడానికి నిఘంటువుల్లో వేలాది కొత్త పదాలను చేర్చాల్సివచ్చింది.

క్రీ.శ 1000 సంవత్సరంలో ఇంగ్లీషులో కేవలం 40 వేల పదాలకు మించిలేవు. లాటిన్, ఫ్రెంచ్, జర్మన్, స్కాండినేవియన్ భాషల నుండి తీసుకున్న పదాలతో ఇంగ్లీష్‌లో పదాల సంఖ్య గణనీయంగా పెరుగుతూ వచ్చింది. బ్రిటిష్ వలసవాద పాలనాకాలంలో ఇలా ఇతర భాషల నుండి పదాలను అరువు తెచ్చుకోవడం ఎక్కువగా జరిగింది. బ్రిటిష్ పాలన సాగిన అన్ని దేశాల్లోని ప్రధాన భాషల నుండి బాగా ప్రాచుర్యం పొందిన పదాలను ఇంగ్లీష్ తనలో చేర్చుకుంది. జర్మన్ భాష యూరప్‌లో ఎక్కువ ఆధిక్యాన్ని కలిగి ఉండేది. కాల క్రమంలో బ్రిటన్ వలసరాజ్యాలు సాధించడంలో ముందుడడంతో ఇంగ్లీష్ యూరప్‌తో పాటు ఆసియా, ఆఫ్రికా, అమెరికా, ఆస్ట్రేలియా వంటి ఖండాలకు వేగంగా వ్యాపించింది. ఇంగ్లీష్‌లో ఎక్కువ పదాలు ఆంగ్లో–శాక్సన్ (ango-saxon) భాష నుండి వచ్చాయి. తరువాత కాలంలో లాటిన్, ఫ్రెంచి పదాలు ఎక్కువగా ఇంగ్లీష్‌లో చేరాయి.



అంతర్జాతీయ వ్యాపారం, దౌత్య సంబంధాలు, శాస్త్రపరిశోధనలు, సాంకేతిక పరిజ్ఞానం, సమాచారం, బ్యాంకింగ్, ఆర్థిక కార్యకలాపాలు, ప్రభుత్వ వ్యవహారాలు ఇంగ్లీష్‌లోనే జరుగుతున్నాయి. ఇంగ్లీష్ మాతృభాష కాని దేశాల్లో సైతం సాధారణ ట్రాఫిక్ కంట్రోల్ సమాచారం సైతం ఇంగ్లీష్‌లోనే ఉంటున్నది. బ్రిటిష్ వలస దేశాల్లో ఇది మరీ ఎక్కువగా ఉంది. ప్రాంతీయ శాసనసభ కార్యకలాపాలు సైతం ఇంగ్లీష్‌లోనే సాగిస్తున్నారు. సినిమాలు, సంగీతం, సంస్కృతిక సంబంధాలు అన్నీ కూడా ఇంగ్లీష్‌లోనే నడుస్తున్నాయి. చివరకు ఆయా దేశాలు తమ మాతృభాషలను వదిలి ఇంగ్లీష్‌లోనే తమ పిల్లలకు పాఠాలను చెబుతున్నాయి. ఒకప్పుడు సోషలిస్టు దేశాలు ఇంగ్లీష్ కంటే జాతీయ భాషలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేవి. అందుకే ఆయా దేశాల అధ్యక్షులు సైతం ఇతర దేశాల్లో పర్యటించే సమయంలో వారి మాతృభాషలోనే మాట్లాడేవారు. గ్లోబలైజేషన్ పెద్దఎత్తున జరుగుతుండడంతో ఇంగ్లీష్ కూడా గ్లోబల్ భాషగా అవతరిస్తున్నది. చైనాతో పాటు, జపాన్ కూడా నేడు ఇంగ్లీష్ భాషకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నది. మరో వంక ఇంగ్లీష్ ప్రభావాన్ని అడ్డుకునేందుకు స్పానిష్ భాషను ఆయా దేశాలు సంఘటితం చేస్తున్నాయి. మన దేశంలో విభిన్న భాషలు ఉన్నప్పటికీ ప్రాథమిక విద్యలో సైతం ఇంగ్లీష్‌నే బోధిస్తున్నారు. ప్రపంచవ్యాపితంగా వాడుతున్న కంప్యూటర్లలో ఉన్న డేటా మొత్తం ఇంగ్లీష్‌లోనే ఉంది. ప్రపంచవ్యాపితంగా ఐదు వేల న్యూస్ పేపర్లు ఇంగ్లీష్‌లో వస్తున్నాయి. రోజూ పంపే టెలెక్స్ సమాచారంలో మూడో వంతు ఇంగ్లీష్‌లోనే పంపుతున్నారు. మన దేశంలో మూడు వేల మ్యాగజైన్లు ఇంగ్లీష్‌లో ప్రచురించబడుతున్నాయి. టూరిజం అభివృద్ధిలో కూడా ఇంగ్లీష్ కీలకంగా మారింది. కంప్యూటర్ సంస్థలు విపరీతంగా పెరుగుతున్నందున ఇంగ్లీష్ తప్పనిసరిగా మారింది. హోటల్స్‌లో, చివరకు చిన్నచిన్న షాపుల్లో సైతం పని చేసేవారికి ఇంగ్లీష్ వచ్చివుండాలన్న నిబంధనను యజమాన్యాలు పెడుతున్నాయి. చైనాలో టీవీ కార్యక్రమం ద్వారా ఐదు కోట్ల మంది ఇంగ్లీష్ నేర్చుకుంటున్నారు. ఇంటర్నెట్ ఆన్‌లైన్‌లో 95 శాతం మంది ఇంగ్లీష్‌లోనే సంభాషించుకుంటున్నారు. 2050 నాటికి ప్రపంచంలో అత్యధికంగా 138 కోట్లకు చైనీస్ భాషను మాట్లాడే వారి సంఖ్య పెరుగుతుందని అంచనా వేశారు. రెండో స్థానంలో హిందీ, ఉర్దూ కలిసి 55 కోట్ల మంది, ఇంగ్లీస్‌ను 50 కోట్లమంది మాట్లాడతారని అంచనా. తరువాత స్థానాల్లో స్పానిష్, అరబిక్ భాషలు వుంటాయి.

భాష ఒక తీరని దాహం. అది అంతులేని సముద్రం వంటిది. కాలం, మారుతున్న అభిరుచులు, శాస్త్రసాంకేతిక పరిజ్ఞానం, మానవ సమాజాభివృద్ధి, ఆర్థిక, రాజకీయ మార్పులు, భౌగోళిక, సామాజిక మార్పులు, వ్యాపారం, విద్య, ఇలా అనేక రంగాల్లో నిత్యం మార్పులు వస్తూనే ఉంటాయి. ఈ మార్పులకు అనుగుణంగా కొత్త పదాల కలయికలు నిరంతరం జరుగుతుంది. ఈ ప్రవాహానికి అంతంలేదు. వీటన్నింటినీ ఒక క్రమంలో అందించే విజ్ఞాన ఖని, భావాల దిక్సూచి 'నిఘంటువు'. ◆

మొదటి నిఘంటువు



ప్రపంచంలో అసలు మొదటి నిఘంటువును ఎవరు తయారు చేసివుంటారు?! ఇందుకు చరిత్రలో సరైన ఆధారాలు లేవు. అందుబాటులో ఉన్న సమాచారం మేరకు క్రిగ్‌టన్ యూనివర్శిటీ చేసిన పరిశోధనల ప్రకారం 1604లో మొదటి సారి నిఘంటువు (డిక్షనరి)ను ఇంగ్లీష్‌లో రాబర్ట్ కాడ్రే (robert cawdrey) రూపొందించినట్లు తెలుస్తున్నది. రాబర్ట్ కాడ్రేనే ఈ డిక్షనరీని రూపొందించినట్లు 17వ శతాబ్దంలో టోరంటో యూనివర్శిటీ ధృవీకరించింది. దీని తరువాత ఇంగ్లాండులో ఫిలసాఫికల్ సొసైటీ ఆఫ్ లండన్ 1857లో సరికొత్త ఇంగ్లీష్ డిక్షనరీ తయారీకి పిలుపునిచ్చింది. పది సంవత్సరాల్లో నాలుగు వాల్యూమ్స్‌ను ఒక్కొక్కటి 1600 పేజీల చొప్పున తయారు చేయాలని నిర్ణయించారు. కొత్త నిఘంటువు తయారీకి పదాలను పంపించాల్సిందిగా సొసైటీ చేసిన విజ్ఞప్తికి ప్రపంచవ్యాపితంగా విశేష స్పందన వచ్చింది. 50 లక్షల కొటేషన్లు, ఇంతకు రెట్టింపుగ్గా పదాలు వచ్చాయి. చివరకు ఎడిట్ చేసి 414800 పదాలను, 1,861200 కొటేషన్లను ఇందులో చేర్చారు. పది సంవత్సరాల్లో పూర్తి చేయాలనుకున్న నిఘంటువును 70 సంవత్సరాలకు అంటే 1928లో పూర్తి చేశారు. నాలుగు అనుకుంటే అది 12 సంపుటాలు, ఒక సప్లిమెంట్‌తో ముద్రించారు. ఇదే నిఘంటువును మార్పులు చేర్పులు చేసి 1986లో ప్రచురించారు. దీన్ని తిరిగి ముద్రించాలని 1972లో పని ప్రారంభించి 86లో పూర్తి చేశారు. 5730 పేజీలతో నాలుగు సంపుటాలతో ముద్రించారు. మొదట ముద్రించిన నిఘంటువులో క్రీస్తు శకం 1150 నాటి నుండి వాడుకలో ఉన్న పదాలను చేర్చారు. వీటిలో ఎక్కువ భాగం ఇంగ్లీష్ మాతృభాషగా ఉన్న ఏడు దేశాల నుండే తీసుకున్నారు. పారిశ్రామిక విప్లవం విజయవంతం కావడంతో ఏర్పడిన అవసరాలను ఈ పాత నిఘంటువు తీర్చలేకపోవడంతో తిరిగి ముద్రించాలని నిర్ణయించారు. యంత్రాలు అభివృద్ధి కావడం, సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి కావడంతో అనేక కొత్త పదాలను చేర్చారు.



అసలు మలేరియా ఎలా వస్తుంది ?

రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ప్రస్తుతం దోమలు బాగా ప్రబలాయి. దోమల ద్వారా మలేరియా వ్యాధి వ్యాపిస్తుంది. ప్లాస్మోడియం అనే సూక్ష్మక్రిమి ఈ వ్యాధికి కారణమవుతుంది. ఇది కంటికి కనబడదు. మైక్రోస్కోపు ద్వారానే చూడగలం.

మలేరియా సీజనిది, జాగ్రత్తగా ఉండాలి మరి!

ఇది ఏ మలేరియా ?

మలేరియా పేరసైట్లలో ముఖ్యంగా ప్లాస్మోడియం ఫాల్సీపేరం ముఖ్యమైనవి. గతంలో మన ప్రాంతంలో 99 శాతం వరకు వైవాక్స్ ద్వారా వ్యాధి ప్రబలేది. గత రెండు మూడేళ్ళ నుండి ఫాల్సీపేరం ద్వారా ఎక్కువగా మలేరియా ప్రబలుతున్నది. ప్లాస్మోడియం ఫాల్సీపేరం వల్ల మలేరియా వ్యాధి బారిన పడుతున్న వారు దాదాపు 30 శాతం వరకు వున్నారు.

ఎట్లా తెలుస్తుంది ?

ఈ వ్యాధి దగ్గుతో మొదలు కావచ్చు. జలుబుతో మొదలు కావచ్చు. ఏ జ్వరాన్నైనా మనం పరీక్షలు చేస్తే చివరికది మలేరియాగా తేలవచ్చు. ఒక్కోసారి శరీరంలో ఎక్కడైనా చీము గడ్డలు లేవడం వల్ల జ్వరం రావచ్చు. ఊపిరితిత్తుల్లో ఇన్‌ఫెక్షన్ వుండి న్యూమోనియా కారణంగా జ్వరం రావచ్చు. ఇలా రకరకాల కారణాల వల్ల జ్వరం రావచ్చు. ఇలాంటి కారణాలేవీ మనకు కనబడనట్లయితే దాన్ని మనం మలేరియాగానే అనుకోవలసి వస్తుంది.

ఎవరికి వస్తుంది ?

గర్భవతులు, పిల్లలు, బాగా వృద్ధులైన వారు ఈ వ్యాధి బారిన పడే అవకాశాలు ఎక్కువ. ఆరోగ్యవంతులైన వారు కొంతవరకు తట్టుకోగలుగుతారు. ఎవరైనా సరే, ఎలాంటి జ్వరమొచ్చినా నిర్లక్ష్యం చేయకుండా క్వాలిఫైడ్ డాక్టర్‌ను సంప్రదించి, కనీస పరీక్షలు కొన్ని చేయించుకుంటే జ్వరం దేనివల్ల వస్తుందనేది అవగతమవుతుంది. ఒకే డాక్టర్ వద్ద చికిత్స కొనసాగించడం కూడా అవసరం. రోజుకో డాక్టర్‌ను మార్చుతూ పోయినట్లయితే వ్యాధి తాలూకు లక్షణాలు తెలుసుకోలేరు.

డిపార్టుమెంటు వారు కాదన్నారే!

చాలామంది రోగులు తమకు జ్వరం రాగానే మలేరియా శాఖ వద్దకు వెళ్ళామని, వాళ్ళు రక్త పరీక్ష చేసి మలేరియా కాదన్నారని, అందువల్లనే మందులు వాడటం లేదని చెబుతుంటారు. ఈ రక్తపరీక్షలో చాలా సార్లు పాజిటివ్ వుండకపోవచ్చు. ఒకే ఒక్కసారి రక్తపరీక్ష చేయడం వల్ల మనకు మలేరికా కనబడకపోవచ్చు. అందుకే పలుమార్లు పరీక్ష చేయించుకోవలసిన అవసరముంది. రెండు రోజుల్లో ఐదారుసార్లు పరీక్ష చేయాలి. అధిక జనాభా గల మన దేశంలో అన్నిసార్లు పరీక్షలు జరపడమనేది అసాధ్యం. అందువల్ల ఒకసారి మలేరియా శాఖ వారు మలేరియా లేదని చెప్పినంత మాత్రాన వదిలివేయకూడదు. ఇంకా జ్వరమొస్తున్నట్టయితే క్వాలిఫైడ్ డాక్టర్ దగ్గరకెళ్ళి చూపించుకోవడం, అవసరమైన పరీక్షలు చేయించుకోవడం మంచిది.

మలేరియా కాదేమో! టైఫాయిడ్ అయి ఉండొచ్చు ?

కొంతమంది ఆదుర్దాతో జ్వరం వచ్చిన వెనువెంటనే (అంటే 2-3 రోజులలోనే) వైడాల్ టెస్టుల్లాంటివి చేయిస్తుంటారు. ఇది సరికాదు. మొదటి వారంలో వైడాల్ టెస్ట్ పాజిటివ్ వచ్చినా అసలు దాన్ని పట్టించుకోనవసరం లేదు. రెండో వారం తరువాతనే వైడాల్ టెస్ట్‌కు కొంత ప్రాముఖ్యత ఉంటుంది.

ఇది గమనంలోకి తీసుకోకుండా మొదటివారంలోనే వైడాల్ టెస్ట్ పాజిటివ్ అని చెప్పేసి టైఫాయిడ్ ట్రీట్‌మెంట్ ఇస్తూ వుంటారు. కానీ ఎక్కువ కేసుల్లో అది మలేరియా అవుతుంది. ఈ రీతిలో సమయం వృధా అయిపోతుంది. మలేరియా మనం ఎంత త్వరగా గుర్తించి లేదా అనుమానించి చికిత్స ప్రారంభిస్తే అంత మంచి ఫలితం లభిస్తుంది. ఆరోగ్యపరమైన సమస్యలకు లోనయ్యే ప్రమాదమూ వుండబోదు.

ఫాల్సీ పేరం మలేరియా వలన ప్రమాదాలు

ప్రత్యేకించి ఫాల్సీ పేరం మలేరియా

ఫాల్సిపేరం మలేరియా



ఫాల్సిపేరం దోమల ద్వారా వ్యాపిస్తుంది. ప్లాస్మోడియం ఫాల్సిపేరమ్ అనే క్రిమి ద్వారా ఈ వ్యాధి సంక్రమిస్తుంది. ఎక్కువ సందర్భాలలో కామెర్లగా ఈ వ్యాధి బయటపడవచ్చు. చలిజ్వరం, మగత, మూత్రవిసర్జన లేకుండుట, రక్తలేమి, కామెర్లు, ఫాల్సిపేరమ్ మలేరియాలో ఉండవచ్చు. మగతతో పాటు మతిమరుపుగా మాట్లాడటం, అడ్డదిడ్డంగా పడుకోవడం, ఫిట్స్, కోమాలోనికి వెళ్ళడం ఈ వ్యాధికి గురియైన వారిలో సంభవించవచ్చు. ఇది అత్యంత ప్రాణాపాయమైన వ్యాధి. వెంటనే వైద్య పర్యవేక్షణ ఎంతైనా అవసరం. క్వినైన్ కొన్ని సందర్భాలలో ఇంజక్షన్ రూపంలో వాడవలసి రావచ్చు. క్వినైన్ సరియైన మోనిటరింగ్ సౌకర్యం ఉన్న ఆసుపత్రిలో వైద్య సలహాలతో వాడటం మంచిది. ఈ వ్యాధితో పాటుగా వచ్చు మెదడువాపు, మూత్ర పిండాల ఫెయిల్యూర్, హెపటైటిస్, రక్తలేమి, ఊపిరితిత్తులలో నీరు చేరడం మొదలైన సమస్యలు సకాలంలో గుర్తించి సరియైన వైద్య సహాయంతో ప్రాణాలను రక్షించడం సాధ్యమవుతుంది. పచ్చ కామెర్లను అనుకరించే అనేక వ్యాధుల్లో ఫాల్సిపేరం మలేరియా ముఖ్యమైనది.

నివారణ

ఈ వ్యాధికి ప్రధాన కారణమైన దోమలను నివారించుటకు సరిమైన డ్రైనేజీ సౌకర్యాలను అమర్చడం, ఇంటి చుట్టు పక్కల నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవడం, నిల్వ ఉన్న నీటిపై కిరోసిన్ చల్లడం, ప్రస్తుతం అందుబాటులో ఉన్న జెట్, ఆల్ అవుట్ మొదలైన దోమల నివారణ పరికారాలను ఉపయోగించడం, దోమ తెరల వాడకం మొదలైన చర్యలతో సాధ్య పడుతుంది.

కారణంగా తలెత్తే సమస్యలు చాలా తీవ్రమైనవి. అది మెదడు మలేరియాకు దారి తీయవచ్చు.



కామెర్లకు దారితీయవచ్చు. మూత్రపిండాలు పని చేయకుండా పోవచ్చు. ఊపిరితిత్తులలో నీరు చేరి ఆయాసం రావచ్చు. ఇలా చాలా తీవ్రమైన సమస్యలే రావచ్చు.

ఫాల్సిపేరం మలేరియా అనేది ఒక ప్రాణాంతక వ్యాధి. ఉదాహరణకు ఆఫ్రికాలో సంవత్సరానికి దాదాపు ఒక మిలియన్ (పది లక్షలు) మరణాలు దాని వల్ల సంభవిస్తున్నాయి. పిల్లలే ఎక్కువగా ఈ ఫాల్సిపేరం మలేరియా వల్ల చనిపోతూ ఉంటారు. ఇక్కడ మనకు ఫాల్సిపేరం మలేరియా అంత ఎక్కువగా లేనప్పటికీ అది గత రెండు మూడేళ్ళుగా పెరుగుతున్నట్లు అనిపిస్తోంది.

రాకుండా ఏమి చేయాలి ? ఎవరు చేయాలి ?

మలేరియా వ్యాధి వ్యాప్తికి కారణమయ్యే దోమలను నిర్మూలించడం ద్వారానే ఈ వ్యాధిని నివారించవచ్చు. ఇందుకు ప్రభుత్వమే పూనుకోవలని వుంది. వ్యక్తిగతంగా తీసుకునే కొన్ని జాగ్రత్తలూ కొంతమేరకు మనకు రక్షణనిస్తాయి. దోమతెరలు ఉపయోగించడం, ఇళ్ళలోకి దోమలు రాకుండా జాగ్రత్త పడటం, దోమలు కుట్టేందుకు వీలులేని రీతిలో వస్త్రాలు ధరించటం, కాళ్ళకు సాక్సులు, బూట్లు వేసుకోవడం లాంటి జాగ్రత్తలను మనం తీసుకోవచ్చు. ఈ విధమైన జాగ్రత్తల వల్ల దోమలు కుట్టేందుకు అంతగా వీలుండదు. కాబట్టి జబ్బు వచ్చే ప్రమాదం తక్కువగా ఉంటుంది. నిల్వవుండే నీటిలో దోమలు బాగా వృద్ధి చెందుతాయి. నీరు నిల్వ వున్న గుంటల్లో దోమల పెరుగుదలను అరికట్టేందుకు మలాథియాన్ లాంటి పురుగు మందులను చల్లించాలి. ఇది ఎవరికి వారు వ్యక్తిగతంగా చేయలేరు. ప్రభుత్వ యంత్రాంగం, మున్సిపాల్టీలు ఇలాంటి చర్యలు చేపట్టడం ద్వారా సామాజిక ఆరోగ్యాన్ని కాపాడాలి. మలేరియా నుంచి ప్రజలకు రక్షణ కల్పించాలి. అలాగే మన ఇళ్ళల్లో, పరిసరాల్లో నీరు నిల్వ వున్నప్పుడు దాంట్లో కొద్దిగా కిరోసిన్ గానీ, ఏదైనా ఆయిల్ గాని కలిపినట్లయితే దోమలు పెరగకుండా వుంటాయి.

ఏదేమైనా మలేరియా పట్ల స్పష్టమైన అవగాహనతో ముందు జాగ్రత్తగా కొన్ని నివారణ చర్యలు తీసుకుంటే వ్యాధి దరిచేరే అవకాశాలు తక్కువ. ◆

ఆరోగ్య సలహాల కోసం ప్రశ్నలు పంపండి

ఆదివారం అనుబంధంలో పాఠకుల నుంచి ఆరోగ్య సమస్యలపై ప్రశ్నలు ఆహ్వానిస్తున్నాం. మీ సమస్యలకు నిపుణులైన వైద్యులు పరిష్కారాలు సూచిస్తారు. ప్రశ్నలు సూటిగా, సాధ్యమైనంత కుప్లంగా ఉండాలి.

ప్రశ్నలు పంపవలసిన చిరునామా :

సంపాదకులు, ఆదివారం అనుబంధం,
ప్రజాశక్తి దినపత్రిక, స్ట్రీట్ నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్ - 20

స్నేహితురాలు

కమల స్కూల్ నుండి రాగానే వాళ్ల అమ్మ

– నీకో గుడ్‌న్యూస్ రాణి దగ్గర నుండి ఉత్తరం వచ్చింది. అని చెప్పింది.

నిజంగానా ! అంటూ కమల స్కూలు బ్యాగును పక్కన పడేసి ఆత్రంగా పరిగెత్తుకెళ్లి ఉత్తరం చించి చదవడం ప్రారంభించింది. కమలకు రాణికి ఈ మధ్యనే స్నేహం ప్రారంభం అయింది. రాణి మద్రాసులో ఉంటుంది. కమల హైదరాబాద్‌లో ఉంటుంది. ఇద్దరు తొమ్మిదవ తరగతి చదువుతున్నారు. ఆలిండియా క్విజ్ పోటీలకు కమల మద్రాసు వెళ్లినప్పుడు రాణితో పరిచయం అయింది. రాణి తల్లితండ్రులు కూడా తెలుగు వారు కావడం, వారిద్దరూ అక్కడ ప్రభుత్వ ఉద్యోగస్తులు కావడం, వారి ఉదాత్తభావాలు సహజంగానే రాణిలో ప్రతిఫలించడం – ఇవన్నీ కమలకు చాలా ఆకర్షణీయంగా, ఆనందంగా ఉండేవి. తనకు జీవితంలో రాణివంటి ఉత్తమ స్నేహితురాలు దొరకడం నిజంగానే తన అదృష్టం అనుకొని కమల సంబరపడి పోయేది.

ఇదంతా గమనించిన కమల వాళ్ల అమ్మ కమల ఆనందంతో పాలుపంచుకునేది.

ఈసారి రాణి ఏం విషయాలు రాసిందే... అంటూ పాలగ్లాసుతో రూములోకి వెళ్లిన కమల అమ్మ .... అక్కడి సన్నివేశం చూసి నిర్ఘాంతపోయింది. కమల ఉత్తరాన్ని చేత్తో పట్టుకొని వెక్కివెక్కి ఏడుస్తుంది.

ఏమయిందమ్మా రాణికేంకాలేదుగా ఆత్రుతగా అంటుండగానే కమల పరుగెత్తుకుంటూ వచ్చి అమ్మను చుట్టేసి బావురుమంది. ఉత్తరం అమ్మ చేతికిస్తూ మరే... రాణి అమ్మను, నాన్నను పోలీసులు అరెస్టుచేసి తీసుకెళ్ళారట అంటూ ఏడుస్తున్నది.

అమ్మ ఉత్తరాన్ని ప్రశాంతంగా చదవడం ప్రారంభించింది.

ప్రియమైన కమల !

ఈసారి ఉత్తరంలో మన సరదాలు, చదువులు గాక ఓ కొత్త విషయం రాద్దామని అనుకుంటున్నాను. దాన్ని కట్టుకథగా తీసేయకు. నిజంగా జరిగిందే.

మా అమ్మ, నాన్న గురించి నీకు తెలుసుగా. ఇద్దరూ ఇక్కడి సెక్రటేరియట్‌లో ఉద్యోగులే. నాన్న వాళ్ల యూనియన్ నాయకుడు కూడా. వాళ్ల సమస్యల పరిష్కారం కోసం ఇక్కడి రాష్ట్రంలోని ఉద్యోగులందరూ సమ్మె చేస్తున్నారు. సమ్మెలో ఉపాధ్యాయులు కూడా ఉండడంతో మా స్కూల్స్‌కూడా సరిగా నడవడం లేదు. మొత్తం 12లక్షల మందికిపైగా సమ్మె చేస్తున్నారట.

అసలు విషయం ఏమిటంటే రాత్రి పోలీసు వ్యాను మా ఇంటికి వచ్చింది. మా అమ్మ, నాన్నలతో పాటు ఉద్యోగం చేస్తున్న చుట్టు ప్రక్కల అంకుల్స్‌ను, ఇద్దరు ఆంటీలను అదే వ్యానులో తీసుకు పోయారు. అమ్మ నైటీలో ఉంది. నైటీ మార్చుకుని వస్తానన్న ఆడపోలీసులు వచ్చి లాక్కుపోయారు. మీపై టెస్మా ఉంది అని తీసుకుపోయారు. టెస్మా అంటే తమిళనాడు ప్రభుత్వం విద్రోహచర్యగా ఎవర్నైనా ముందుగా అరెస్టు చేసే అధికారమట. ఇన్‌స్పెక్టర్ చెప్పాడు. నాన్న మాత్రం ధైర్యంగా ఉండు బేబి త్వరలోనే వచ్చేస్తాం. అని చెప్పి వెళ్లాడు. నాకేం భయంలేదుగాని ఎప్పుడు వస్తారా ? అని మాత్రం ఎదురుచూస్తున్నాను. మరే కమల ! ఇట్లా మూడున్నర లక్షల మంది ఉద్యోగుల్ని అరెస్టు చేసారట. ప్రొద్దున్నే వంట చేద్దామనుకునే లోపల ఐదుగురు అంటీలు వచ్చి ఈ రోజు నీ భోజనం మా ఇంట్లో అంటే మా ఇంట్లో అంటూ బలవంత పెట్టారు. ఈ విషయాన్ని నీతో పంచుకోవాలని ఉత్తరం వ్రాస్తున్న. అమ్మా, నాన్నలు రాగానే ఉత్తరం రాస్తాను. గుడ్‌బై.

ఉత్తరం చదివాక అమ్మ కమలకు ధైర్యం చెప్పాలనీ నిశ్చయించుకుంది.

ఎందుకే కమలా అలా ఏడుస్తావు ? ఇప్పుడు ఏమైందని ?

మరి పోలీసులు రాణి వాళ్ల అమ్మ, నాన్నలను విడిచిపెట్టి ఉంటారా. అంటూ ఏడుపు ముఖంతోనే కమల ప్రశ్నించింది.

ఎందుకు విడిచిపెట్టరు ? రాణి ఉత్తరంలోనే రాసిందిగా మూడున్నర లక్షల మందిని అరెస్టు చేసినట్టు. అంతమందిని జైళ్లల్లో ఉంచడం సాధ్యమా ! ఒకరోజు, ఓ వారం, కాకపోతే ఓ నెలా.. ఉత్తరం వ్రాసిన రాణి ఓ పక్క ధైర్యంగా ఉంటే నీవిలా బేలవైపోతేఎలా ? కష్టాల్లో ఉన్న రాణికి ఓ స్నేహితురాలిగా ధైర్యం ఇవ్వాలా ? అక్కర్లేదా? లేకుంటే ఇలా ఏడుస్తూ కూర్చోవాలా ?– అమ్మ జవాబు.

కమల కళ్లు తుడుచుకుంటూ ఎలా? అని అమాయకంగా ప్రశ్నించింది. సమ్మె చేయడం కార్మికుల, ఉద్యోగుల జన్మహక్కు అన్న విషయం మీకు పాఠాల్లో చెప్పలేదా? – చెప్పారు.

మీ ఉపాధ్యాయులు, మీరు ఎప్పుడూ సమ్మె చేయలేదా ?– చేశాము.

వాళ్లు అంతే. రాణి అమ్మా, నాన్నలు నాయకులు కాబట్టి సమ్మెలో ముందున్నారు. వారు అరెస్టు అయినందుకు వారుగాని, రాణిగాని భయపడడం లేదు. ధైర్యంతో పోరాడుతున్నారు. వాళ్ల అమ్మ, నాన్నల పోరాటానికి నీ సంఘీభావం తెలియజేయి. డాడీతో చెప్పి వాళ్లకు మద్దతుగా ఇక్కడి ఉద్యోగుల సమావేశం ఏర్పాటు చేయమని అడుగు. తమిళనాడు ఉద్యోగులపై అక్కడి ప్రభుత్వం చేస్తున్న దుర్మార్గానికి నీ మిత్రులకు, టీచర్లకు తెలియజేయి. ఇలా చేస్తున్నట్లు ఉత్తరం వ్రాయి...

అంతే కమల కొత్త ఉత్తేజంతో రాణికి ఉత్తరం వ్రాయడానికి ఉపక్రమించింది.

అమ్మ మాటలు ఆపేసి తృప్తిగా నవ్వింది. ◆

అక్షరం అగ్నికణమై

దుక్కిదున్ని, నీరు కట్టి
నారు వేస్తే, గింజలు పండి
మంది కడుపు నిండుతుంది!
దారం తీసి, కండె చుట్టి
మగ్గం నేసి, బట్టతీస్తే
జనం సిగ్గు నిలుస్తుంది
చెమటోడ్చి ఇటుక చేసి
గోడకట్టి, కప్పు వేస్తే
నిలువ నీడ ఉంటుంది
పలకమీద బలపాన్ని అరగదీస్తే
అక్షరం అబ్బుతుంది
కడుపు నింపుకోవచ్చు
ఇల్లు గడుపుకోవచ్చు
బ్యాంకు బ్యాలెన్సులు పెంచుకోవచ్చు
అంతేకాదు కావలసింది
అక్షరంతో మెదడు వికసించాలి
ప్రకంపన పుట్టాలి
నాల్కల మీద నినాదమై మారుమోగాలి
యోధుడి తుపాకిలా పేలాలి
ప్రత్యర్థుల గుండెల్లో శతఘ్నులు కావాలి
కుర్చీలు విరగాలి
పీఠాలు కదలాలి
పీడనలు తొలగాలి
నవశకానికి అంకురం కావాలి
మరో అధ్యాయానికి నాంది పలకాలి

- పి.ఎం.సుందరరావు

ఎక్స్‌గ్రేషియా

మీ 'విశ్వీకరణ' రంగు కళ్ళద్దాలను
తీసిచూస్తే
మా చితికిపోయిన పల్లె బ్రతుకులు
కనిపిస్తాయి.
స్తన్యమిచ్చే తల్లిని కోల్పోయిన
అనాథల్లా..
మీరిచ్చే ఎక్స్‌గ్రేషియాల కోసం
ఆశల అశోక వృక్షాల క్రింద
బాధల పల్లవులు
ఆలాపిస్తూ...
మా స్వప్నాలు
ఇంద్ర ధనస్సుల్ని గీసుకుంటున్నాయి
మేము కోరుకోకపోయినా
మిథ్యా సానుభూతి మేఘాలు
కురుస్తూనే ఉంటాయి.
ఏ కపటం ఎరుగని పల్లె జనం
బుల్లితెరముందు కూచోని
బహుళ జాతి కంపెనీలకు
రిమోట్ ద్వారాలు తెరుస్తున్నారు
మా చేతి వృత్తుల పనితనాన్ని
మీ డాలర్లకు పేటెంట్ చేశారు
మా వ్యవసాయమంతా
శనగపచ్చ పురుగుల్లా మేసి
మా బ్రతుకుల్ని డొల్లి అయిన
పత్తి కాయల్ని చేశారు
ఏ అవాంట్ మందూ పని చేయదు
మీరిచ్చే ఎక్స్‌గ్రేషియాల కోసం
చూసి... చూసి
మా కంట నీరు ప్రశ్నార్థకంలా
మారింది
అది తడిగా తగిలినపుడు
దేవుడి గూటిలో
దీపం ఆరిపోయింది

- మురళి వట్టికూటి

* అమ్మిన శ్రీనివాసరాజు

సృజనాత్మకతను పెంచాలి



"హోమ్‌వర్క్‌కి కావాలంటే నిన్ననే తెచ్చారు మీ నాన్న కొత్త నోట్ పుస్తకం... ఇవాళ్ళ దాన్నిండా అర్థంపర్థం లేని బొమ్మలతో పాడు చేశావ్. ఇలాగైతే నీకు ఎన్నని పుస్తకాలు కొనాలి?!" ఎనిమిదేళ్ళ తరుణ్ వాళ్ళమ్మ గీత పిల్లాడికి హోమ్‌వర్క్ చేయిస్తూ కసురుకుంటోంది...

మూలనున్న ఖాళీ అగ్గి పెట్టెలన్నీ జాగ్రత్తగా తీసి అన్నింటినీ పుల్ల సహాయంతో ఒకదానిలో ఒకటి దూర్చి పొడవాటి రైలు నమూనా చేసి దానిని నేలమీద ఒద్దికగా నడిపిస్తూ... "హాయ్... అమ్మా... చూడు నా రైలు బండి చుక్... చుక్... చుక్..." అంటూ ఆనందంతో కేరింతలు తీయసాగాడు ఆరేళ్ళ కార్తీక్.

సాధారణంగా పిల్లల్లో మూడు సంవత్సరాల వయస్సు దాటిన తరువాత నుండి పరిసరాల పట్ల అవగాహన, ఆసక్తి ఏర్పడి ఏదో చేయాలని, ఏదో సాధించాలని తపన ప్రారంభం అవుతుంది. అది కాస్తా ఐదు సంవత్సరాలు దాటేసరికి శరీరంలో శక్తి పెరిగి ఆలోచనలను కార్యరూపం చేస్తూ ఆ పనులే అల్లరి పనులుగా అనిపించి పెద్దల అరుపులకు - దెబ్బలకు గురవుతుంటారు పిల్లలు.

పిల్లల్లో చిన్నతనంలో అంకురించే ఆలోచనలు - పనులే భావిజీవితంలో అభ్యాసం ద్వారా 'సృజనాత్మకత' తోడై చక్కని మార్గాలు ఏర్పడతాయి. కాని క్రమశిక్షణలో భాగంగా బాలల్ని బందీలను చేసి వారిలోని సృజనాత్మకతను అంతమొందిస్తున్నామనే ఆలోచనే మనకు రావడం లేదు.

అసలు 'సృజనాత్మకత' అంటే ఏమిటో చూద్దాం. తాను చూసిన అంశానికి తన ఆలోచన జోడించి దానికి ఒక కొత్త విధానంలో తయారు చేయడమే 'సృజనాత్మకత'. ఈ సృజనాత్మకత అనేది ప్రతి ఒక్కరిలోనూ ఉంటుంది. దానిని కొంతమంది కృషితో, అభ్యాసంతో అభివృద్ధి చేసుకుంటారు. మరి కొంతమందిలో ఆ సృజనాత్మక శక్తి తగిన చేయూత అభ్యాసంలేక అంతరించి పోతుంది. కొందరు పిల్లలు చిన్నతనం నుండే చక్కని బొమ్మలు వేయగలుగుతారు. మరికొందరు తాము చూసిన బొమ్మలు తగు విధంగా మార్చివేయగలుగుతారు. ఇంకొందరు తాము తెలుసుకున్న సైన్స్ ప్రయోగాన్ని మార్చి మరొక విధంగా చేయవచ్చునేమో అని ఆలోచిస్తారు. దీనినే 'సృజనాత్మకత' అంటారు. ప్రకృతి పరిశీలన వలన అనేక సృజనాత్మక ఆలోచనలు ఆవిర్భవిస్తాయి. చిన్నపిల్లల్లో అంతర్గతంగా వుండే ఈ సృజనాత్మకతను వెలికితీసి సరైన సుశిక్షణతో అభివృద్ధి పర్చాల్సిన బాధ్యత పెద్దలందరిపైనా వుంది. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనను జాగ్రత్తగా పరిశీలించడం ద్వారా ఆయా పిల్లల్లో వుండే సృజనాత్మకత బహిర్గతం చేయవచ్చు. ఏరంగం - ఏ విషయం పట్ల ఆ పిల్లలు ఆసక్తి చూపుతున్నారో అర్థం చేసుకొని దానికి తగిన సూచనలు, సలహాలు, అవకాశాలు అందించడం ద్వారా పెద్దయ్యాక ఆ రంగంలో అద్భుతాలు సాధిస్తారు అనడంలో అతిశయోక్తి లేదు. ఒకవేళ అద్భుతాలు సాధించలేకపోయినా... ఆ ఆలోచనల రూప కల్పనలే భావిజీవితంలో ఉపాధి చూపడమే గాక సంఘంలో చక్కని గుర్తింపు తెచ్చి పెడుతుంది అనడంలో అసత్యం లేదు.

ఈ అద్భుతమైన సృజనాత్మకతకు 'పరిశీలన-ఆలోచన' అనే సాధనాలే చక్కని మార్గాలు. ఈ విషయాల గురించి ఇటు ఇంటివద్ద తల్లిదండ్రులు, పెద్దలు. అటు పాఠశాల్లో అధ్యాపకులు తగిన శ్రద్ధ తీసుకోవాలి. ఈ సృజనాత్మక శక్తి మీద అనేక దేశాల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు కూడా నిర్వహిస్తున్నారు.

ప్రతిరోజూ అనేక రకాల వస్తువులు, పరికరాలు చూస్తుంటాం. వాటిని చూసి వదిలివేయకుండా అవి ఎలా పని చేస్తున్నాయి. వాటిని అభివృద్ధి చేయవచ్చా? ఒకరకమైన పరికరాలతో ఎలాంటి పనులు చేయవచ్చు? ఇలాంటి ప్రాథమిక ఆలోచనలు, ప్రశ్నలు వేసుకుని ఆయా సమస్యలకు సమాధానాలు రాబట్టుకోవాలి.

ఇక పాఠశాలల్లో అధ్యాపకులు తమ తమ బోధనల్లో ప్రసంగ ధోరణితో పాటు ప్రయోగాత్మకంగా, ప్రదర్శనాపూర్వకంగా బోధనలు చేయడం, ప్రతి సంవత్సరం సైన్స్ ఎగ్జిబిషన్స్ (వైజ్ఞానిక ప్రదర్శనలు) ఏర్పాటు చేయడం లేదా ఆయా ప్రదర్శనలు చూసే అవకాశాలు కల్పించడం వంటి చర్యలు చేపట్టాలి. ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు చూడటం వల్ల పిల్లల్లో వినోదంతో కూడిన విజ్ఞానం, సృజనాత్మకతలు అలవడి అనేక కొత్త కొత్త ఆలోచనలు ఆవిర్భవించడానికి అవకాశాలు ఏర్పడతాయి. ఎంత తెలివైన వాడైనా ఊరికే శూన్యంలో కూర్చుని ఆలోచిస్తే అవి ఊహలు, కల్పితాలే అవుతాయి తప్ప నిజమైన అనుభూతి చేకూరదు. అదే స్వయం వీక్షణతో, స్వీయ అనుభవంతో కలిగిన భావాలకు ఆలోచనలు తోడైతే అవే అద్భుతాలవుతాయి. అవి సైన్సులోగాని... సాహిత్యంలోగాని.. పనికిరాని వస్తువులతో.. పారేసే పరికరాలతో చక్కని బొమ్మలు, ఫ్లవర్‌వాజ్‌లు, ద్వారతోరణాలు, లైట్‌స్టాండ్‌లు వంటి అనేక రకాల గృహోపకరణాలు అందంగా తయారు చేసే వీలుంది. ఉదా:చీపురు పుల్లలతో బొమ్మలు, తాటాకులతో ఫ్లవర్ వాజ్‌లు, చాక్లెట్ కాగితాలతో ద్వారాలకు చక్కని తోరణాలు. ఇక కుట్లు, అల్లికలు సరేసరి, ఇలాంటి వాటిలో ప్రవేశం, అనుభవం వున్న పెద్దలు, పిల్లలకు నేర్పడం ఎంతైనా శ్రేయస్కరం. ఇలాంటివి తయారు చేయడం వల్ల ఎక్కువ ఖర్చుతో కావాల్సిన వస్తువులను, తక్కువ ఖర్చుతో తయారు చేసుకోవచ్చు. స్వయంగా చేసుకున్నామనే తృప్తి కలుగుతుంది.

ఈ 'సృజనాత్మకత'లో కేవలం కుట్లు, అల్లికలు కళాత్మక వస్తువులు తయారు చేయడం సైన్సు ప్రయోగాలు చేయడమే గాదు. ఓ మంచి బొమ్మ వేయడం, ఒక చక్కని కథ రాయడం, కవిత రాయడం, ఒక కార్టూన్ వేయడం, మంచి సంగీతం, పాట, నృత్యం, అభినయం... ఏదైనా ఒకటుంటుంది.

పూర్వం మన శాస్త్రవేత్తలు - సాహితీవేత్తలు ఈ అమూల్యమైన సృజనాత్మకశక్తి ద్వారా అనేక విలువైన పరికరాలు, ప్రక్రియలు మనకు అందించారనే విషయాలు పిల్లలకు అర్థమయ్యేటట్లు వివరించి వారిని ఆయా రంగాల్లో ప్రోత్సహించాలి.

అయితే నేడున్న స్పీడు ప్రపంచంలో యాంత్రిక జీవన శైలి మార్కులు - ర్యాంకులే ప్రాతిపదికన సాగుతున్న చదువుల వల్ల ఈ విషయాలన్నీ విద్యేతర విషయాలుగా భావించి విద్యే ప్రధానం అన్న ఆలోచనతో ఇలాంటి విషయాలకు నేటి పెద్దలు పిల్లలను వీలైనంత దూరంగా వుంచుతున్నారు. చదువులు, జీవనాలు అన్నీ యాంత్రికంగా, కృత్రిమంగా సాగిపోతున్నాయి. దరిమిలా సృజనాత్మకతకు చోటు లేకుండా పోతోంది.

కనుక చదువులకు చెరుపు రాకుండా ఉంటే ఖాళీ సమయాల్లోనో లేక పండుగ సెలవులు, వేసవి సెలవుల్లోనూ ఇతర సమయాల్లో అయినా పిల్లల్లోని సృజనాత్మకత అభివృద్ధి చేయడానికి కృషి చేయాలి. తద్వారా భావి తరానికి ఉన్నతమైన ఆవిష్కరణలు - మహోన్నతమైన ఆలోచనలు అందుతాయని అందరూ గుర్తించాలి. అందుకు ఆచరణాత్మక ఆలోచనలతో ముందుకు సాగాలి. ◆

ఫ్యాషన్



అదో దట్టమైన అడవి. దాని పక్కనే ఓ గూడెం. ఆ గూడెంలోని ఓ రైతు కోళ్లను పెంచుకునేవాడు. అడవిలో నివసించే ఒక నక్క రాత్రిపూట వచ్చి ఆ కోళ్లను దొంగిలించేది. రైతు దాన్ని పట్టుకోవాలని ఎంత ప్రయత్నించినా వీలుకాలేదు. గంపకింద కప్పిపెట్టిన కోళ్లలో రోజుకోదాన్ని తీసుకుపోయి తినేది. ఆ రైతు బాగా ఆలోచించి పట్నం వెళ్లి ప్రత్యేకంగా ఒక బోను తయారుచేయించాడు. బోనులో ఒకవైపు కోళ్లను వుంచి, మరో వైపు ద్వారం తెరచిపెట్టి నిద్రపోయాడు. రోజుటి మాదిరిగానే అర్ధరాత్రిపూట నక్క మెల్లగా ఇంట్లోకి వచ్చి, కోళ్లబోనులో అడుగుపెట్టింది. అంతే ఆటోమేటిగ్గా తలుపు పడిపోయింది. కోళ్లకు నక్కకు మధ్య ఇనుప తీగలతో చేసిన వల అడ్డు వుంది. నక్కను చూసి కోళ్లు అరవడంతో రైతు మేల్కొని బోనువైపు వచ్చాడు. నక్క తప్పించుకోవడానికి శత విధాలా ప్రయత్నించింది. కాని తలుపు ఎంతకూ రాలేదు. 'రోజూ నా కోళ్లు తిని పోతావా? నీకు తగిన శాస్తి చేస్తా చూడు' అని ఇంట్లోకి వెళ్లి కత్తి తీసుకొచ్చాడు. తనను చంపవద్దన్నట్లు కళ్లు దీనంగా పెట్టి అరిచింది. జాలిపడ్డ రైతు దాని రెండు చెవులు, తోక కోసి, బోనులోంచి వదిలేశాడు. బాధతో, అవమానంతో అడవిలోకి పోవాలనిపించ లేదు దానికి. ఆ ఊరి దర్జీ దగ్గరకెళ్లి బతిమాలుకుని, తోకకూ, రెండు చెవులకూ టోపీలు కుట్టించుకుంది. అప్పుడు హుషారుగా ఈలవేస్తూ అడవిలోకి వెళ్లింది. నక్క వేషం చూసిన సాటి నక్కలన్నీ 'ఏమిటీ వేషం?' అనడిగాయి. 'ఇదే ప్రస్తుతం పట్నంలో నడుస్తున్న ఫ్యాషన్' అని చెప్పింది. నక్కలు మరేమీ ఆలోచించకుండా తమ చెవులు, తోకలు కత్తిరించుకుని టోపీలు కుట్టించుకుని అడవిలో తిరగసాగాయి.

ఒకనాడు పెద్దగాలిదుమ్ము వచ్చింది. ఆహారం వెతుక్కుంటున్న మన నక్క సుడిగాలిలో చిక్కుకుంది. దుమ్ముకు, కళ్లు కూడా కనిపించక గట్టిగా మూసుకుంది. సుడిగాలి తగ్గిన పిదప కళ్లు తెరచి చూసేసరికి టోపీలు కాస్తా ఎగిరి పోయాయి. గాలికి ఎటుకొట్టుకుపోయాయో ఎంత వెదికినా కనిపించలేదు. విసిగిపోయి యింటికి వెళ్లసాగింది. అప్పుడు కొన్ని నక్కలు ఎదురయ్యాయి. 'నీ టోపీల ఫ్యాషన్ ఏమైంది? ఫ్యాషన్ మారిందా?' అనడిగాయి ఆసక్తిగా.

'ఫ్యాషన్ లేదు. పత్తి కట్టె లేదు' అంటూ జరిగిన కథ అంతా చెప్పి 'ఆ మొండితోక, మొండి చెవులతో వస్తే నన్ను మీరందరూ 'మొండినక్క' అని అవమానిస్తారు. అందుకే టోపీలు కుట్టించుకుని ఫ్యాషన్ అని చెప్పాను. మీరు నిజంగానే నమ్మేసి తోకలు, చెవులు కత్తిరించుకుని, టోపీలు తగిలించుకుని ఫ్యాషన్ అని తిరుగుతున్నారు. ఇప్పుడు మీ తోక, చెవులుకూడా నా వాటిలాగే వున్నాయి. కనుక నన్నెవరూ అవమానించరు' అంది.

దాని మాటలు విని నక్కలన్నీ సిగ్గుపడ్డాయి. ఫ్యాషన్ అని చెప్పగానే ఏ మాత్రం ఆలోచించకుండా తమ చెవులు, తోక కత్తిరించుకున్నందుకు సిగ్గుపడి తల వంచుకుని వెళ్లిపోయాయి.

పుష్పాల కృష్ణమూర్తి



క్విజ్-67

1. వాడిబ్బవంటకు ఉదాహరణ?
   ఎ.వరి బి. చెరకు
2. 'శాంతిప్రియ' అన్న బిరుదు ఎవరికుంది?
   ఎ.లాల్‌బహదూర్‌శాస్త్రి బి. ఇందిరాగాంధీ
3. పొడవైన గోడ ఎక్కడ వుంది?
   ఎ. చైనా బి. బంగ్లాదేశ్
4. ప్రపంచంలోకెల్లా ఎత్తైనశిఖరము ఏది?
   ఎ. కాంచనగంగ బి. ఎవరెస్టు
5. పెన్సిలిన్‌ను కనుగొన్నదెవరు?
   ఎ.గూటెన్‌బర్గ్ బి.అలెగ్జాండర్ ఫ్లెమింగ్
6. అంతర్జాతీయ న్యాయస్థానము ఎక్కడ వుంది?
   ఎ. న్యూయార్క్ బి. హేగ్
7. పెన్సిలు ములుకుల తయారీలో వాడునది?
   ఎ. తగరం బి. గ్రాఫైట్
8. ఇంటిని కట్టడానికి పనికిరాని నేల?
   ఎ. ఊబినేల బి. రాతినేల
9. క్రిమిసంహారక పదార్థము
   ఎ.బ్లీచింగ్ పౌడర్
   బి.కార్బను
10. ఈ ఫొటోలోని వ్యక్తి ఎవరు?
   ఎ.సీతారాం ఏచూరి
   బి. ప్రకాష్ కరత్

చిన్నారి చిత్రకారులు



ఎస్‌కె.మస్తాన్‌వలీ, 5వ తరగతి,
ఆళ్లపాడు, ఖమ్మం.



గంటా శిరీష, 4వ తరగతి,
విపిఎస్‌స్కూల్, వైరా.

ఎం.రాజ్‌కుమార్, 10వ తరగతి,
జెడ్.పి.హెచ్.ఎస్, ముక్తల్, మహబూబ్‌నగర్.

ఎన్.గోపాల్, 7వ తరగతి,
రామ్‌రెడ్డిపల్లి, మహబూబ్‌నగర్.

ఇక్కడ మేము ఎంత మందిమి వున్నాం?



జవాబు: 13 మంది

డాన్స్ చేసే అర్థ రూపాయి!

హాయ్! నా దగ్గర డాన్స్ చేసే అర్ధరూపాయి బిళ్ల వుందిగా! అది ఎంత బాగా డాన్స్ చేస్తుందంటే ... అమ్మో నేనైతే మాటల్లో చెప్పలేను. మీరు చూసి తెలుసుకోవాల్సిందే. అయితే చూస్తారా మరి. ఆ ఇదిగో చూశారా. ఇది కూల్‌డ్రింక్ సీసా. మీ అందరికీ తెలిసే వుంటుంది. ముందు ఇందులో వున్న కూల్‌డ్రింక్ అంతా తాగేస్తా. లేకపోతే కూలింగ్ పోతుందిగా అందుకు. తాగేశా కదా. ఇప్పుడు ఇదిగో నా డాన్స్ చేసే అర్ధరూపాయి బిళ్లను దాని మీద ఒక అర నిమిషంపాటు అదిమి పట్టుకుని వదిలేశా. ఏమైంది? భలే డాన్స్ చేస్తోందికదూ. కిందికీ మీదికీ ఏం ఎగురుతోంది! మరేంటనుకున్నారు! ఏంటీ... అలా చూస్తున్నారు. మీకు ఈ అర్ధరూపాయి బిళ్ల కావాలా! 'అబ్బా... ఆశ... దోశ... అప్పడం.. వడ... నేను చాలా కష్టపడి దీన్ని సంపాదించా' అంటాననుకున్నారా? అదేంలేదు. మీక్కూడా ఈ మేజిక్ ఏంటో చెప్పేస్తా.

మీరు మీ పాఠాల్లో ఒక విషయం తెలుసుకుని వుంటారు. అదేంటంటే... వస్తువులను వేడిచేస్తే వ్యాకోచిస్తాయని. అవునా. చల్లటి సీసాలోని డ్రింక్‌ని మనం తాగేస్తాం. అప్పుడు సీసాలోని చల్లగాలి వేడి అవుతుంది. ఆ వేడి గాలి బయటకు వచ్చి నాణెం చేత డాన్స్ చేయిస్తుంది. అంతే... మరి బావుందా ఈ మేజిక్. మీకు నచ్చితే ఈ పేజీ అంతా పూర్తిగా చదివి మీకు నచ్చిన శీర్షికలలో పాల్గొనండే. అలా చేస్తే మీకు వచ్చేవారం మరో మాంచి మేజిక్ చెప్తా. బై బై.

క్విజ్ 66 జవాబులు

ఎన్ 2. శివాజీ 3. చౌయన్‌లై 4. పోత
నుము 5. సింధుప్రజలు 6. రవివర్మ 7.
లిగివుండడం 8. ఆక్సిజన్ 9. మిల్లీ మీటరు
0. భీష్మ సహానీ

క్విజ్ 65కి సరైన సమాధానాలు రాసిన వారు :

వి.యేసేబు, 10వ తరగతి, **వి.పుల్లారావు** 0వ తరగతి, **జి.వెంకటేశ్వర్లు**, 10వ తరగతి, రుద్రగొండపాలెం, ప్రకాశం. **ఎస్.పాండురంగారావు**, 7వ రగతి, బ్రాడీపేట, గుంటూరు. **పి.పల్లవి**, అనకాపల్లి, శాఖ. **ఐ.రత్తమ్మ**, 9వ తరగతి, మెదక్. **ఎల్.విప్లవ**, 9వ రగతి, నల్గొండ. **టి.వెంకన్న**, 7వ తరగతి, **ఎస్.వేణు**, 6వ రగతి, పొన్నూరు, గుంటూరు.

బీర్బల్ యుక్తి!

ఓసారి దర్బారులో అంతా కూర్చుని వున్నారు. అక్బర్ చక్రవర్తి మాత్రం రాలేదు. ఆఖరుకు బీర్బల్‌కూడా వచ్చి తమ ఆసనంలో ఆసీనులైవున్నారు. మహా రాజాగారి ఆలస్యానికి గల కారణం మాత్రం సభలోని వారికి అర్థంకాలేదు. ఇంతలో అంతఃపురం నుంచి ఓ భటుడు వచ్చి 'మహారాజాగారికి పుత్రుడు జన్మించారు' అని విన్నవించి వెళ్లిపోయాడు. ఈ వార్త విని అంతా చాలా సంతోషించారు. ఈలోగా మరో సేవకుడు వచ్చి 'చక్రవర్తిగారి భార్య ఒకామె మరణించారు' అని చెప్పి వెళ్లిపోయాడు. ఆ వార్త విని సభలోని వారంతా విచారంలో మునిగి పోయారు. చాలా బాధపడ్డారు.

అక్బర్-బీర్బల్ కథలు

కానీ మరుక్షణమే మరో అనుమానం వచ్చింది. 'ఈ రెండు వార్తలు విన్న మాకే ఓసారి విషాదం, మరోసారి సంతోషం కలిగాయి. మరి మహారాజుగారి పరిస్థితి ఏంటి? ఇప్పుడు ఆయన వస్తే ఎలా స్పందించాలి. పుత్రుడు జన్మించినందుకు శుభాకాంక్షలు తెలియచేయాలా? లేక భార్య మరణించినందుకు విచారం వ్యక్తం చేయాలా?' అన్న సందిగ్ధంలో పడిపోయారు. అందరూ కలిసి బీర్బల్‌ను సలహా అడిగారు. దానికి బీర్బల్ 'ఏముంది! దీని గురించి ఎక్కువగా ఆలోచించనవసరంలేదు. మహారాజుగారు నవ్వుతూ వస్తే మనంకూడా నవ్వుతూ పుత్రుడు జన్మించినందుకు శుభాకాంక్షలు చెబుదాం. అలాకాక ఆయన విచారవదనంతో వస్తే మనం కూడా విచారం వెలిబుచ్చుదాం' అన్నాడు.

అందరికీ ఈ ఉపాయం బావుందనిపించింది. అలాగే చేద్దామనుకున్నారు. మరి కొద్ది నిముషాలలోనే పాదుషావారు వచ్చారు. అప్పుడు సభలోని వారంతా బీర్బల్ చెప్పినట్టే చేసి గండంనుంచి గట్టెక్కారు.

కలం స్నేహం

రు: వెనిగళ్ల లక్ష్మణసాయి,
యసు : 8సం॥
దువు :3 వతరగతి
బీలు : టీవీలో కార్టూన్ చిత్రాలు చూడడం.
ర్తి చిరునామా : వెనిగళ్ల లక్ష్మణసాయి, సన్నాఫ్ ఐ.యశోదరాజ్, కొత్తపేట, 1వ ర్డు, మంగళగిరి, గుంటూరు.

పేరు: ఐ.సాయి బాల వర ప్రకాష్,
వయసు : 9 సం॥
చదువు :4 వతరగతి
హాబీలు : టీవీ చూడడం, డ్రాయింగ్‌వేయడం.
పూర్తి చిరునామా :ఐ.సాయిబాలవరప్రకాష్, సన్నాఫ్ నాగరాజు, కొత్తపేట, మంగళగిరి, గుంటూరు.

హాయ్... మీక్కూడా కలం స్నేహం చేయాలని వుందా! మరి ఆలస్యం ఎందుకు!! ఒక కార్డు తీసుకుని మీ పేరు, హాబీలు, చదువుతున్న తరగతి, పూర్తి అడ్రస్ రాయండి. ఇంకా... మీ ఫొటో కూడా అతికించి పోస్టు చేయండి...అంతే. మా చిరునామా : బాలనేస్తాలు, ప్రజాశక్తి, స్ట్రీట్ నెం.1, అశోక్‌నగర్, హైదరాబాదు.

సాహిత్యంలో నోబెల్ గ్రహీత

భారతదేశంలో నోబెల్ బహుమతి పొందిన మొట్టమొదటి భారతీయుడు రవీంద్రనాథ్ టాగూర్. ఈయన సాహిత్యంలో 1913వ సంవత్సరంలో నోబెల్ పురస్కారం అందుకున్నారు. టాగూర్ అద్భుతమైన, సున్నితమైన కవిత్వం రాశారు. చిన్నప్పటినుంచి ఆయనకు సాహిత్యంపై ఆసక్తి ఎక్కువ. టాగూర్‌ను గురూజీ అని పిలిచేవారు. 1861వ సంవత్సరంలో జన్మించిన టాగూర్ 1941వ సంవత్సరంలో మరణించారు.

పదాల పదనిసలు

ఒక్క అక్షరం కలపండి

!	నుగడ
	వతి
	మస్తం
	గం
	వరణ
	మస్య

గతవారం జవాబులు

	క	థ
		ల
		నుమ
		లకలం
		మ్మని
		రివేపాకు

✻ రుక్మిణి

కోటివరాలూ... కొత్తరకం పేదలు!

"ఒరే... మీ వూరు మొత్తానికి ఒక 'పటం' తయారు చెయ్యాలె! దానికి పూరాగా మీ వూర్లె వున్న అందరి ఇండ్ల వివరాలు కరకట్టుగా చెప్పాలె! అంటే మీ కుటుంబ పరిస్థితిననుసరించి అందరికీ 'పేదరికం' గ్రేడింగు పద్ధతిన నెంబర్లిస్తామన్నమాట... మొత్తం మీ వూర్లె అయిదొందల కుటుంబాలున్నాయి. వీటన్నిటికీ సీరియల్ నెంబర్లియ్యాలె!"

సర్వేయరుగారు రావిచెట్టు చప్టామీద నిలబడి వివరాలు చెబుతుంటే జక్కులోడు, మల్లేశం... చాలా మంది జనం ఆబగా వినుకుంటూ నిలబడ్డారు.

"ఎందుకంటే మొన్నటి జన్మభూమిలో మీరందరూ పోటీలు పడి కోటివరాల కోసం అప్లికేషన్లిచ్చినారు – అందులో నుండి ఎవనికి రేషను కారట్లివ్వాలె... కక్కసు దొడ్ల సంగతి... ఇండ్లకోసం ఎవర్ని ఎంపిక చెయ్యాలె... అబ్బో... చంద్రబాబుగారు మహానాడులో కోటివరాలు ప్రకటించంగానే కోటీ యాభై లక్షల అప్లికేషన్లు వచ్చిపడె! మరింగ భవిష్యత్తులో 'స్వర్ణాంధ్ర' సాధించాలంటే గీ ఫారాలన్నిటినీ పరిశీలన చేసి ఎవడెవడికి ఏం ఇవ్వాల్నో నిర్ణయించాల్నాయె... అందుకు పేదల్ని గుర్తించాలె... రకరకాల పేదలున్నారు గద... కడు పేదలు... శాశ్వత పేదలు... దీర్ఘకాలిక పేదలు... సాధారణ పేదలు..

"అంటే ఇంతకాలం నుండి గీ 'స్వర్ణాంధ్ర' ఆలోచన అసలే లేనట్లా? ఇన్ని కోట్ల మంది పేదలకి కనీసం కక్కసుదొడ్లు లెవ్వనే సంగతి గిపుడు గాని తట్టిందన్నమాట! సంబడం!" యాద్గిరి తొడగొట్టి రంకె వేయడంతో అంతా గందరగోళమై పోయింది... అప్పటికే ఇండ్లూ... తెల్లకార్డులూ...ఇచ్చేస్తున్నారేమోనని జనం ఈగల్లా మందలకు మందలే పోగవడంలో సర్వేయరు సర్దుకుని ఈ విధంగా తన కార్యక్రమాన్ని కొనసాగించిన వాడాయెను.

"ముందు మీ వూర్లో అతి పేద... అంటే మహాపేద వాళ్ళందరూ ఒకవేపన్నమాట... సహజ పేదలు..." (నకిలించాడు) సర్వేయరు మాట ముగించగానే "తిండితినక శాన్నాళ్ళయింది మహాప్రెభో... సూడండి" అని ఓ పాతికమంది చినిగిన తమ బనీన్లు పైకెత్తి పీక్కుపోయిన డొక్కల్ని పైకీ కిందికీ ఆడిస్తూ తోసుకుని వచ్చారు.



"రైట్... వీళ్ళు మహాపేదవాళ్ళు.. ఏమయ్యా మీకు ఇండ్లున్నాయా... కప్పు ఎటువంటిది... బెంగుళూరా... మంగుళూరా... స్లాబా... మిద్దెలా... ఆవరణ ఎంత ? వూలవెంక్కలెన్ని? వూగాణీ ఎంత..

సర్వేయరు గారు ఆ దండకం పూర్తి చేసే సరికి పాతిమంది మూర్ఛలోకి జారుకున్నారు. జనం హాహాకారాలు చేశారు.

"తర్వాత మరి సాధారణ పేదలు... పేదలంటే పేదలే... ఇందులో పొట్టకూటి కోసం ఊరొదిలి వలసలు పోతున్న వాళ్ళెంతమంది?"

"యపె... వలసలు పోయి బతుకులీడుస్తున్న వాండ్లు శానా మందున్నారు. మరి వాండ్లు వలసలే పోయిరి! గిపుడు రమ్మంటే యాడ్నుంచి వస్తరు!" జక్కులోడు మటమటలాడుతూ పెడబొబ్బలు పెట్టాడు.

"ఆహఁ... వలసలు పోయిన కుటుంబాల సభ్యులు...

ఒక వందమంది చేతులెత్తారు.... "వీళ్ళు సాధారణ పేదలు... బాగుంది! మీకు ఎన్ని బర్రెలున్నాయి... ఎన్ని కక్కసుదొడ్లున్నాయి – స్వంత ఇంటికి కరంటు సౌకర్యం వుందా? బోరుబావుందా? దానికి మోటరు... మీటరుందా? రెగ్యులర్‌గా కరంటు బిల్లులు కడుతున్నారా? రైట్... టెలిఫోనుంటే దాని నెంబరెంత?"

ఈ ప్రశ్నల ప్రవాహానికి జనం ఘోషలు పెడుతూ సమాధానాలు చెప్తున్నారు. అప్పటికి మధ్యాహ్నం కావడం వల్ల ? ఎండమాడ్చి పారేస్తుంది. సర్వేయరుగారు చెవట్లు కక్కుతున్నారు.

"ఇపుడు ఇతరులు... ఇతరులంటే చెప్పండి.. కారున్న వారెంతమంది? దాని మోడలు... స్కూటరున్న వాండ్లు... ఏ.సి. గదులుంటే ఎన్ని...

జనం ఒక్కసారిగా అల్లరికి లేచారు – పరమ చండాలమైన బూతులతో ఆ ప్రదేశమంతా దద్దరిల్లిపోయింది – ఇహ అప్పటికి సర్వేయరు గారు తమ పనిని నిలుపుదల చేశాడు... తిరిగి రెండు గంటల నుండి' గణన ప్రారంభం అని ప్రకటించారు.

* * *

"మీ వూర్లో జనాభా మొత్తానికి మూడు రకాల పేదలున్నారని గుర్తించి వాండ్లకు సీరియల్‌గా నెంబర్ల వ్యవహారం జరిగిపోయింది" అని చకచకా ఒకటి నుండి 500 వరకూ నెంబర్లు వారు చదవడంలో వీరు" ఆహా... ఏమి పరిపాలన... ఒక్క పూటలో తమ దరిద్ర శాతాల్ని లెక్కగట్టి... ప్రాధాన్యతలను నిర్ణయించిన స్మార్టు సర్కారుకు జేజేలు" అని మెచ్చుకోలుగా చిటికెలు వేశారు జనం.

"ఇది సాధారణ సర్వే... మరిపుడు 'అసాధారణ సర్వే' నిర్వహించి దీనికి సీరియల్‌గా ఒకటి నుండి 500 వరకు టోకు నెంబర్లు నిర్ణయిస్తాం! మొదటి నెంబర్లకు ఈ నెంబర్లు కలవాలన్నమాట... ఇది పూర్తిగా 'దారిద్ర్యరేఖకు దిగువ' వారిని నిర్ణయించే సూత్రాల ప్రకారం నడుస్తుంది" అని సర్వేయరుగారు ప్రకటించడంతో జనాలు అవాక్కయ్యారు.

"దీన్లో ముందుగా మీ ఆహార లభ్యత... దుస్తులు... అంటే ఆహారంలో మీరు వాడే మాంసకృత్తులు... పండ్లు.. రసాలు... అంటే రోజుకు ఎన్ని లీటర్ల పాలు... వెన్న.. జున్ను మాంసం... ఆ వివరాలతో 'ఘనమైన దరిద్రుల్ని' నిర్ణయించి నెంబర్లిస్తాం!"

చాలా మంది జనం మూర్ఛల్లోకి జారుకున్నారు. "ఇంట్లో ఫ్యాన్ల సంఖ్య... ఫ్రిజ్జులు, అలంకరణ సామాగ్రి... సెంట్లు... విదేశీయానం...

చాలామంది జనం అరుచుకుంటూ... తిట్టుకుంటూ పొలోమని పరుగులు తీశారు. అంతా గత్తరగా కంగాళీగా వుంది. సర్వేయరుగారు చంద్రబాబుగారిలా నవ్వారు.

"అదుగదుగో... దారిద్ర్యం... దానికన్నా చాలా లోతున వున్న వాళ్ళు పాతికమంది దాకా ఉరుక్కుంటూ వస్తున్నారు. వాండ్లకు ముందు అన్ని నెంబర్లు ఇవ్వండి" అని జక్కులోడు అరిచేసరికి ఒళ్ళంతా ఎండలకు ఎండి పీక్కుపోయిన డొక్కల్తో పూర్తి స్థాయి గోచీలతో వున్న వాండ్లు పాతిక దాకా "రేషన్ కారుట్లు... కక్కుసుదొడ్లు... "మాక్కావాలె" దరఖాస్తులిచ్చినం సారో... పది కాలాల్నుండీ పేదలం..." అని అరుచుకుంటూ వస్తుండడంతో సర్వేయరుగారు లబలబలాడుతూ అక్కడ్నుంచి చిత్తగించిన వాడాయెను.

"ఒరే... ఈ సర్వేల పేరుతో ఒక సంవత్సరం... సెలక్షన్ల పేరుతో మరో సంవత్సరం... అటు తర్వాత ఒకడికో ఇద్దరికో ఇస్తే గిస్తే ఆ కక్కసుదొడ్లు మంజూరు చేస్తారు మన చంద్రబాబుగారు" అని యాద్గిరి అనే సరికి జక్కులోడు నోరు బార్లా తెరిచాడు! ◆

తమరు చాకులాటి మనిషే కావచ్చు. అమోఘమైన తెలివితేటలు తమ సొంతం కావచ్చు. అంత మాత్రాన తమరు రొమ్ము విరుచుకు తిరక్కూడదు. నేను తెలివైన మనిషిని - కడు చమత్కారిని - నాతో పెట్టుకుంటే ఎంతటి వాడైనా ఫినిష్ అంటూ విశేషణాలు తమరు ప్రచారం చేసుకోకూడదు! ఆ పద్ధతిలో సుఖం లేదు. అవతల మనిషి అవును కాబోలని జడుసుకుంటాడు. తమతో పెట్టుకుంటే ఏమి గొడవవుతుందోనని - తమకు బహుదూరంగా వుంటాడు. తమరు ఏది మాటాడినా అందులో ఏదో మెలిక వుంటుందని ఆరాలు తీస్తాడు. కాకి నల్లగా వుండును అని తమరో మాటంటే - ఆ స్టేట్‌మెంటులో ఏదో తిరకాసుందనుకుంటారు. పాలు తెల్లగా వుండునని చెప్పినా - ఆ ముక్క సాక్షాత్తు తమరే ఎందుకు సెలవిచ్చేరోనని ఆందోళన పడతారు. అంచేత తమరేది మాటాడినా దానికోలింకు వుండి వుంటుందని వెతుకుతారు.

మహామేధావి...

తమరు షేవింగు చేసుకోకుండా గెడ్డం మీసాలు పెంచుకుపోతుంటే - శకుని బ్రాండు ఆలోచనలు ఏవో తమని కెలుకుతున్నాయని భయపడతారు. తమరు దీర్ఘాలోచన ముద్రలో వుంటే ఎవరి కొంపుకో నిప్పు పెట్టే ప్రయత్నంలో వున్నారని ఊహాగానం చేస్తారు. అంచేత తమరు తొందరపడి 'మేధావి' అనే బోర్డు మెళ్ళో తగిలించుకుని తిరక్కూడదు! వ్యవహారం సాఫీగా సాగాలనుకున్నప్పుడు సాధ్యమైనంత అమాయకంగా కనిపించాలి. ప్రతి చిన్న విషయానికీ అవునా అని ఆశ్చర్యం నటించాలి. అప్పుడు గాని మీ బతుకు బండి కుదుపుల్లేకుండా నడవదు గాక నడవదు! ఇదంతా మగాడు తయారు చేసుకున్న థియరీ!

దేవుడున్నాడో లేదో తెలీదు. శ్రీకృష్ణుడు దేవుడైనా కాకపోయినా - కేరెక్టరు పరంగా గొప్ప చమత్కారి! మగాళ్ళ థియరీలను తయారు చేసింది ఆ కేరెక్టరే! మాయ థియరీల తయారీలో శ్రీవారికి పెద్ద పేరుంది! ఈ విద్యలో వారే ఆద్యులు! ఆ పరమాత్మకి అన్నీ తెలుసు. ఏమీ తెలీనట్టు ప్రవర్తించడం ఆయన ప్రత్యేకత! రేపు ఏమిటి జరుగుతుందో ఆస్వామికి ఇవాళ తెలుసు. బాగా తెలుసు. రేపటి గొడవని సినీమా చూసినట్టు ఇవాళే చూసేయగలడు. అర్జునుడ్ని విడిచి పెడితే ఏం చెరుగుతాడో తెలుసు. అభిమన్య కుమారుడు ఎంతటి వీరుడో, ఎట్లు మరణించునో తెలుసు. ధర్మరాజుక్కోవమొస్తే సప్త సముద్రాలూ అల్లకల్లోలమవుతాయని బాగా తెలుసు. ఇన్ని తెలిసి కూడా ఏమీ తెలీనట్టు కథ నడిపించేడు!

ఆ మాయ కేరెక్టరు లేకపోతే మహాభారతం అన్ని చాప్టర్లతో అంత భారీ గ్రంథంగా వెలిసేది కాదు! కథ స్క్రీన్‌ప్లే దర్శకత్వం వగైరాలన్నీ శ్రీవారి చేతిలోనే వున్నాయి. అయినా సరే - ఎక్కడా శ్రీవారు తొణకలేదు. బెణకలేదు. సాదాసీదా మనిషల్లే అమాయకమైన ఆ నవ్వు, ఆ చూపులే మిగతా కేరెక్టర్లను పడగొట్టేయి! ప్రియసఖి సత్యభామ శ్రీవారిని కాలితో తన్నినా - చిరునవ్వుతో ఆ దెబ్బని తుడిచేసుకున్నాడు. పైగా - నా కిరీటం తగిలి నీ కాలికి గాయం కాలేదు గదా సత్యా అని ప్రేమ నటిస్తూ అడిగేడు. ఆ మాటతో ఆ తల్లి శ్రీవారి మాయ మాటలకు పడిపోయింది. అపచారం జరిగింది ప్రభూ అని లెంపలేసుకుంది. పాపం మూటకట్టుకున్నానని తల్లడిల్లిపోయింది. అల్లాడిపోయింది. వలవలా ఏడ్చేసింది. ఆమెను కొట్టి ఏడిపించడం కంటే - ఆమె చేత దెబ్బతిని ఆమెను ఏడిపించడమనేది గొప్పఫీటు! అది కృష్ణుడికే తెలుసు!

కృష్ణుడు వీర మొనగాడు! ఆయనకు సరైన వారసులు ఈ మగవాళ్ళు! నీ ప్రయోజనకత్వంతోనే మన సంసార నౌక సవ్యంగా సాగుతోంది సతీమణీ అని డైలాగు విసురుతాడు - ఆమెను కట్టుకున్న మగాడు. నిజం కాబోసని ఆమె పొంగిపోతుంది. నువ్వు లేని నా బతుకు గుడ్డి దీపమంటాడు! నువ్వు నా జీవితంలోకి అడుగు పెట్టిం తర్వాత నేను పెట్రోమాక్సు లైటల్లె వెలుగుతున్నానని కవిత్వం చెబుతాడు! ఆ కవిత్వానికి మురిసిపోతుంది. నీ నిర్ణయాలు అత్యద్భుతమంటాడు. అనితర సాధ్యమంటాడు. అవును కాబోసనుకుంటుంది! నీ సలహాలే నాకు వెలుగు రేఖలంటాడు. పూర్తిగా పరవశించిపోతుంది ఇల్లాలు!

కొన్ని సందర్భాలలో కావాలని అమాయకత్వం నటిస్తాడు. కొన్ని పిచ్చి పనులు చేస్తాడు. వాటిని ఆమె సరిదిద్దుతుంది. సహజంగానే మంచి ఫలితాలు కలుగుతాయి! అందుకు ఆమెను అభినందనల్తో ఆనందపరిచి ఆమెను పూర్తిగా మాయలో ముంచేస్తాడు. మాయలో మునిగిపోయిన ఆ ఇల్లాలు - తన భర్త అమాయక చక్రవర్తని జాలిపడుతుంది. నేనంటూ లేకపోతే ఈ మనిషి పిచ్చివాడై పోయేవాడని భ్రమ పడుతుంది. అక్కడ్తో ఆగిపోదు. ఆ విలువైన ముక్క అటు పుట్టింటి వారికీ, ఇటు అత్త వారింటికీ అరిగిపోయిన రికార్డల్లే వినిపిస్తూ వుంటుంది. ఆమెను ఆ కార్యక్రమంలో వుంచి మగమారాజు రెచ్చిపోతూ వుంటాడు. ఇంటా బయటా చెరిగిపారేస్తూ వుంటాడు. తన మాయలో మునిగిపోయిన మనిషి - తనకి అర్ధాంగిగా దొరికినందుకు - ఆ కృష్ణ పరమాత్మకు చేతులెత్తి మొక్కుతాడు. అంతటి ఘనుడు మగవాడు. ఆడవాళ్ళే పాపం - అమాయకత్వానికి పర్యాయ పదాలు! ◆

✻ రాకెట్ల వీరన్న



ప్రశాంతత నిచ్చే పెన్నా అహోబిలం

పెన్నానది సమీపాన పచ్చని చెట్లతో, ఆహ్లాదకరమైన వాతావరణంతో, నిర్మలమైన ప్రదేశంలో ఉన్న "పెన్నా అహోబిలం" క్షేత్రం ఎంతో ప్రశాంతత నిస్తున్నది. చుట్టూ పచ్చని చెట్లతో, లోతైన ప్రదేశాలతో, నీటి కోనేటితో, ఉద్యానవనాలతో కూడుకున్న ఈ ప్రాంతం చూపరులను ఎంతో ఆకర్షిస్తున్నది. ఇది కేవలం దేవాలయ ప్రదేశమే కాక వినోద విహార స్థలం కూడా.

ఇక్కడ వెలసి ఉన్న స్వామి శ్రీలక్ష్మీనరసింహస్వామి. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలంలో ఉన్న ఈ క్షేత్రం మండల కేంద్రానికి 36కి.మీ. దూరంలోనూ, జిల్లా కేంద్రానికి 36 కి.మీ. దూరంలోనూ ఉంటుంది. అనంతపురం నుండి ఉరవకొండకు, బళ్లారికి, గుంతకల్‌కు వెళ్లే బస్సులు ఈ దేవస్థానం ముందుగా వెళ్తాయి. రహదారి ప్రక్కనే ఉన్నందున ఇక్కడికి చేరడం సులభం. పెన్నా అహోబిలం నర్సింహస్వామి ఇక్కడ చిన్న కొండపై వెలసి ఉన్నాడు. కొండపై ఎంతో అందంగా నలుదిక్కులా రాజగోపురాలతో ఉన్న ఈ క్షేత్రం కనుచూపు మేరలో వచ్చే వారిని ఇట్టే ఆకర్షిస్తుంది. చూపరులకు ఎంతో ఆకర్షణీయంగా, అందంగా కనిపిస్తుంది. పూర్వం "ఉద్దాలక మహర్షి" ఇక్కడ తపస్సు చేశాడని పురాణాలు చెబుతున్నాయి. క్రీ.శ. 1478లో విజయనగర సామ్రాజ్యాధీశుడైన "సదాశివదేవరాయలు" ఈ ఆలయాన్ని నిర్మింపజేసినట్లు శాసనాల ద్వారా తెలుస్తున్నది. సదాశివరాయలు విజయనగరం నుండి పెనుగొండ మార్గమునకు వెళ్తూ, ఈ క్షేత్రము వద్ద సేదతీరినాడట. అప్పుడు ఇతనికి స్వామి కలలో కన్పించి " నీ జైత్రయాత్ర దిగ్విజయమగునని" ఆశీర్వదించాడట. ఈయన తను తిరుగు ప్రయాణంలో మరలా స్వామిని దర్శించి, స్వామి వారికి భారీస్థాయిలో ఆలయాన్ని నిర్మించమని ఉదిరిపికొండ ప్రాంత రాజప్రతినిధికి ఆదేశించాడట. ఆలయ పాలనకోసం పెన్నా అహోబిలం శ్రోత్రియ గ్రామాన్ని దానంగా ఇచ్చినట్లు చరిత్రకారులు చెబుతారు.

రాజు ఆజ్ఞమేరకు ఉదిరిపికొండ ప్రాంత రాజప్రతినిధి కొండపై "నరసింహస్వామి" ఆలయాన్ని, కొండ కింద నైరుతీ దిశన 'లక్ష్మీదేవి' ఆలయాన్ని నిర్మించాడు. నరసింహస్వామి ఆలయం ముందు 45 అడుగుల ఏకశిలా దీప స్థంభాన్ని, రాజుగారి (సదాశివరాయులు)

జ్ఞాపకార్థం ఏకశిలాజయ స్థంబాన్ని ప్రతిష్టించాడు. ఈ దేవాలయాన్ని నిర్మించమని రాజు ఆజ్ఞాపించగా, ఈ ప్రాంత ప్రజలు భూమిశిస్తును రద్దు చేయమని కోరారు. వారి కోరికపై రాజు భూమిశిస్తును రద్దు చేశాడు. ఆలయ అభివృద్ధి కార్యక్రమాల కోసం 1600 ఎకరాల మాన్యం భూమిని దేవాలయానికి ఇచ్చాడు. ఇక్కడ వెలసిన నరసింహస్వామి, లక్ష్మీదేవిలు స్వయంభువులు. ఈ క్షేత్రం పెన్నానది సమీపాన ఉన్నందున, స్వామి వారి పాద ముద్రిక క్రింద "బిలం" ఉన్నందున దీనిని "పెన్నా అహోబిలం" గా పిలుస్తున్నారు.

ఆలయ చరిత్ర : ఈ క్షేత్రానికి తూర్పుదిశన గొల్లపల్లి అనే గ్రామముండేది. గ్రామానికి చెందిన గొల్లపల్లి శ్రీనివాసులు ఆవు ప్రతి రోజు కొండపై ఉన్న బిలం వద్దకెళ్ళి తన పాలు వదిలి వచ్చేది. ఇలా ప్రతిరోజూ జరుగుతుండడంతో శ్రీనివాసులు బాధపడడంతో నరసింహస్వామి కలలో కన్పించి నీ ఆవు పాలు నేను సేవిస్తున్నాను. అనిచెప్పగా, సంతోషంతో ఆ ప్రాంతాన్ని పరిశోధించాడు. కొండప్రాంతంలో బిలంపైభాగాన స్వామివారి పాదముద్రికలున్న శిలాఫలకం, కొండకింద నైరుతీదిశన లక్ష్మీదేవి అమ్మవారి శిల కన్పించింది. స్వామికొండపైన, అమ్మవారికి కొండక్రింద ఆలయాలు నిర్మించాడు. తరువాత విజయనగర సామ్రాజ్యాధీశుడు సదాశివరాయల ఆజ్ఞానుసారం ఈ ప్రాంత రాజప్రతినిధిచే భారీస్థాయిలో ఆలయం నిర్మించబడింది. ప్రతిసంవత్సరం వైశాఖశుద్ధద్వాదశి నుండి, వైశాఖ శుద్ధ అష్టమి వరకు (మేనెలలో) 11రోజులపాటు ఇక్కడ బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. అప్పుడు భారీ సంఖ్యలో భక్తులు, పర్యాటకులు హాజరవుతారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా నరసింహ జయంతి సింహాసనం, శేషవాహనోత్సవం, హనుమంతోత్సవం, గరుడోత్సవం, ఐరావతోత్సవం, అశ్వవాహనోత్సవం, శయనోత్సవం, రథోత్సవం తదితర కార్యక్రమాలు జరుగును. రథోత్సవం రోజున అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు.

సువిశాలమైన అటవీ ప్రాంతంలో ఉన్న ఈ క్షేత్రానికి భక్తులే కాక ఆహ్లాద కోసం, వినోదం కోసం పర్యాటకులు వస్తుంటారు. ఇది ముఖ్యంగా పిక్నిక్ స్పాట్ అని చెప్పవచ్చు. పెళ్లి శుభకార్యాలకు చాలా సౌకర్యవంతమైన ప్రదేశం. రహదారి ప్రక్కనే ఉన్నందున, బాటసారులకు, వాహనదారులకు విశ్రాంతి ప్రదేశం కూడా. ◆

✻ ఎం.కె.రాంప్రసాద్

భారత జూనియర్ వాలీబాల్ జట్టు ఇటీవల థాయ్‌లాండ్‌లో జరిగిన యూత్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సంపాదించడంతో క్రీడాభిమానుల్లో వర్ణించశక్యం కాని ఆనందం నెలకొంది. భారత జట్టు ఫైనల్లో బ్రెజిల్ చేతిలో 87-78 తేడాతో ఓడిపోవడంతో టైటిల్ దక్కించుకునే అవకాశం తప్పిపోయింది. లీగ్ దశలో ఇదే బ్రెజిల్ జట్టుపై మన జట్టు గెలుపొందింది. ఏమైనా ఈ టోర్నమెంట్‌లో భారత్ కొన్ని గణనీయమైన విజయాలు సాధించింది. స్వదేశం తిరిగి వచ్చిన జట్టుకు సహజంగానే ఘన స్వాగతం లభించింది. జట్టుకు ఇరవై లక్షల రూపాయల నజరానా ఇస్తున్నట్లు వాలీబాల్ ఫెడరేషన్ ప్రకటించింది. సాయ్ జట్టును ఘనంగా అభినందించింది. ఇటువంటి విజయాలు జట్టులో ఆత్మవిశ్వాసాన్ని ఇనుమడింపచేస్తాయి. అయితే కోచ్ జట్టు సాధించిన విజయాలతో ఉబ్బితబ్బిబ్బవకుండా భవిష్యత్ గురించి ఆలోచిస్తూ ప్రణాళికలు రూపొందిస్తున్నారు. భారత వాలీబాల్‌తో తనకు 35 ఏళ్ల అనుబంధం ఉందని, ఈ జట్టు ఆడినంత బాగా భారత జట్టు ఇంతకుముందెన్నడూ ఆడలేదని ఆయన ఒక దినపత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఇంటర్వ్యూ ఇలా సాగింది.

'మాకు మంచిరోజులొచ్చాయి'



భారత్ యువ వాలీబాల్ జట్టు సభ్యులతో కోచ్ శ్రీధరన్

ఇటలీ, బ్రెజిల్ వంటి జట్లతో భారత్ తలపడాల్సి వచ్చినపుడు మీ ఆలోచనలు ఎలా ఉన్నాయి?

ఈ జట్లతో ఆడటం నిజంగా కష్టమే. భారత జట్టు వెంట వైద్యుడు కూడా లేరు. ఇద్దరు క్రీడాకారులకు జ్వరం వస్తే మామూలు మందు వేయడానికి కూడా నేను సాహసించలేకపోయాను. ప్రత్యర్థిజట్ల బలాబలాలను వివరించేందుకు వారు ఆడిన మ్యాచ్‌ల క్యాసెట్లను, వీడియో పరికరాలను కూడా ఆస్ట్రేలియా, ఇటలీ జట్లలోని నా స్నేహితుల నుండి సేకరించాల్సి వచ్చింది. అయితే అందుబాటులో ఉన్న పరిమితమైన వనరులను గరిష్ఠ స్థాయిలో వినియోగించుకోగలిగాం. భారత జట్టు టోర్నమెంట్ ఆసాంతం అద్భుతంగా ఆడింది. గత 35 ఏళ్లలో భారత జట్టు ఇంత బాగా ఆడటం నేనెరుగను. మాకు మంచి రోజులొచ్చాయని భావిస్తున్నాను.

ఈ విజయం ప్రభావం ఎలా ఉంటుంది?

ప్రభావం తప్పక ఉంటుంది. అయితే ఈ విజయాలు ఇక ముందు కూడా కొనసాగినపుడు, సీనియర్స్ జట్టు కూడా ప్రేరణ పొంది విజయాలు సాధించినపుడే వీటికి అర్థం ఉంటుంది. వచ్చేనెలలో ఇరాన్‌లో జరగనున్న ప్రపంచ జూనియర్స్ మీట్ భారత జట్టుకు చాలా కీలకమైంది. ఆ టోర్నమెంట్ ఫలితం ఎలా ఉన్నప్పటికీ ఇంతకాలం అనుసరిస్తున్న విధానాలను కొనసాగించడం, కఠోర శ్రమ చేయడం అవసరం. ఒకటి, రెండు సార్లు పొరపాట్లు చేయవచ్చు. అంతర్జాతీయ ఒత్తిళ్లను ఎదుర్కొనగలిగే అనుభవం అలవాటు చేసుకోవాల్సి ఉంది.

ప్రపంచంలో మన పరిస్థితి ఎలా ఉందంటారు?

సాంకేతిక పరంగా చూస్తే బ్రెజిల్, ఇటలీ, రష్యా కంటే మనది ఉత్తమ జట్టు. ఆ జట్లు దేహదారుఢ్యం విషయంలో అవి మన కంటే మెరుగ్గా ఉండవచ్చు. కోచింగ్ విషయానికి వస్తే వాలీబాల్ క్రీడను మూడు విభాగాలుగా విభజించవచ్చు. మొదటి ఎనిమిది పాయింట్లు చాలా కీలకమైనవి. తరువాత ఎనిమిది పాయింట్లు, చివరి ఎనిమిది పాయింట్లుగా మ్యాచ్‌ను విభజించవచ్చు. థాయ్‌లాండ్‌లో మొదటి 16 పాయింట్ల విషయంలో మన జట్టు మేలుగా ఉంది. అయితే విచారించ తగ్గ విషయం ఏమంటే తరువాతే మనం ఏకాగ్రత కోల్పోతున్నాం. ఈ బలహీనతనే బ్రెజిల్ జట్టు ఫైనల్లో సొమ్ము చేసుకుంది. ఛాంపియన్లుగా నిలవాలంటే మ్యాచ్ ఆసాంతం నిలకడగా ఆడాలి. మన కంటే మెరుగైన జట్లతో కనీసం 30, 35 మ్యాచ్‌లు ఆడితే బాగుంటుంది.

సీనియర్స్ జట్టు పరిస్థితి ఇంత ఆశాజనకంగా లేదెందుకని?

ఇందుకు నాకు ఒకటే కారణం కనిపిస్తోంది. క్రీడాకారులుగా నిలదొక్కుకున్న తరువాత ఆదాయం కోసం గల్ఫ్‌కు తరలివెళ్లడం వారికి ఆనవాయితీగా మారింది. గల్ఫ్‌లో క్లబ్‌లు బాగా డబ్బు చెల్లిస్తాయి. అయితే వాటి ప్రమాణాలు అంత సంతృప్తికరంగా ఉండవు. మన క్రీడాకారులను యూరప్, లాటిన్ అమెరికాకు పంపడం మంచిదని నేను భావిస్తాను. కతార్, కువాయిట్‌లో కంటే ఇక్కడ ఆడటమే యుక్తం. మరో విషయం ఏమంటే సీనియర్లలో ప్రేరణ తక్కువగా కనిపిస్తోంది. అందువల్ల వారు నూటికి నూరు శాతం ప్రతిభ చూపడం లేదు. విదేశీ లీగ్‌ల్లో ఇప్పటికే వారు పేరు మోసిన వారు కావడం, బాగా సంపాదించడం కూడా ఇందుకు కారణమని నేను భావిస్తాను.

సీనియర్లు, జూనియర్లలో ఏ తేడా గమనించారు?

సీనియర్ల కంటే జూనియర్లకు కోచింగ్ ఇవ్వడమే నాకు సంతృప్తికరంగా ఉంటోంది. వారు నేను చెప్పింది శ్రద్ధగా అనుసరిస్తారు. సీనియర్ల విషయంలో ఇది సాధ్యం కాదు. వారికి ఆధిక్యతా భావం ఇందుకు అడ్డు వస్తుంది.

మీ భవిష్యత్ ప్రణాళిక ఏమిటి?

ఈ నెలాఖరుకు బెంగుళూరులో శిక్షణ పొందుతున్న సీనియర్ల శిక్షణా శిబిరంలో పాల్గొంటాను. అక్కడ బల్గేరియా కోచ్‌కు సహకరిస్తాను. ఆగస్ట్‌లో జరగనున్న ఆసియన్ జూనియర్ ఛాంపియన్‌షిప్ టోర్నమెంట్ కోసం ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. ◆

✻ యన్నం ఉపేందర్

మధ్యాహ్నం ఇంకా కాలేదు. గుడిసె నీడలో కూర్చొని యల్లమ్మ ఆకాశం వైపు చూస్తూ చేత్తో నేలను రాయసాగింది. ఇంతలో ఆమె భర్త దుర్గయ్య నెత్తిన కండువ వేసుకొని, చమట్లు కక్కుతూ ఇంట్లోకి వచ్చాడు. యల్లమ్మను పలకరించకుండానే గోళం దగ్గరికి పోయి ముఖంపై నీళ్లు చల్లుకున్నాడు.

“అమ్మయ్య ఏమెండ, ఏమెండ? అగ్గి కురుస్తుంది. ఇప్పుడే గిట్లుంటే రేపెట్లుండాలి? ఎండాకాలమంతా ముందే ఉండె!” భార్య వైపు చూస్తూ అన్నాడు దుర్గయ్య.

చిరుగు వస్త్రం

యల్లమ్మ దగ్గర నుంచి ఏం సమాధానం రాకపోయేసరికి దుర్గయ్య,

“సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో
సినబోయి కూకున్నవెందుకమ్మో....”
అంటూ పాడసాగాడు.

అది విన్న యల్లమ్మ,

“ఎహె ఊర్కో, ఓ రోకు ఎండలు దంచి కొడ్తున్నె. ఈ యేడు తిండుగాసం ఎట్లనని నేను రంధి పడ్తాంటే పదం పాడ్తన్నావ్” భర్తపై చిరుకోపం ప్రదర్శించింది యల్లమ్మ.

దానికి దుర్గయ్య,

“ఓర్ని రంధి ఎందుకే? కట్టాలు మొదలు పుట్టి మనం తర్వాత పుట్టినవేం! కొత్తగా బాధపడేదేముంది? వాన రాకడ పానం పోకడ ఎవరికి తెల్సు. అంతా దేవుడి దయ” అన్నాడు.

✻ ✻ ✻

అదొక పల్లెటూరు. ఊరు చుట్టూ, ఊరు మధ్యా గ్రామ దేవతల విగ్రహాలున్నాయి. సంవత్సర కాలంలో ఏదో రోజున ఆ విగ్రహాలకు కొలుపులు జరుగుతూనే ఉంటాయి. ఎక్కువ మంది కూలీ పనిని నమ్ముకున్న వారే. వర్షాలు గత కొంత కాలంగా అరకొరగా పడుతుండడం మూలాన చేతి వృత్తులు దాదాపు మూలన పడ్డాయి. దుర్గయ్య నేత పని కార్మికుడు. నేత పని కలిసి రావడం లేదని వదిలేశాడు.

నాగల్ని నమ్ముకున్న దుర్గయ్య కుటుంబం జరుగుబాటు ఎటమొటంగానే ఉంది. పైగా కరువు పరిస్థితులు నెలకొనడంతో ఆర్థిక పరిస్థితి మరీ క్షీణించింది.

పొలానికి పెట్టుబడి కోసం షావుకారు దగ్గరికి వెళ్లాడు దుర్గయ్య. దుర్గయ్యను చూసిన షావుకారు,

“ఏంది దుర్గయ్యా! దారితప్పి వచ్చినవు” పలకరించాడు.

“ఈ యేడు నారుబోయాలనుకుంటున్నా. సేతిల సిల్లి గవ్వ కూడా లేదు. జర తమరు అప్పిస్తే...” దుర్గయ్య మాటలు పూర్తి కాలేదు.

“కత బాగుంది. పోయినేడాది యిచ్చిన రూపాయలే యివ్వలేదు! పైనంగా మళ్లియ్యాలంటే ఎట్ల” ప్రశ్నిచాడు కనకయ్య.

“మీరు కాదంటే ఎట్ల. వడ్డీతో సహా యిస్త. మీ రుణం ఉంచుకుంటానా ” అన్నాడు దుర్గయ్య బతిమాలే గొంతుతో. షావుకారు మెత్తబడ్డాడు.

“సర్లే! కాయితం రాయించి తీస్కపో డబ్బు. పైసలు పంట పండగానే ఇయ్యాల బిడ్డా, అయిటంక మాట రావొద్దు” కండీషన్‌గా మాట్లాడాడు కనకయ్య.

✻ ✻ ✻

తెల్ల వారింది.

షావుకారు ఇచ్చిన డబ్బులు తీసుకొని మండల కేంద్రానికి, విత్తనాల కోసం వెళ్లాడు దుర్గయ్య. హైబ్రిడు విత్తనాలయే దిగుబడి ఎక్కువ వస్తుందని దొర చెప్పితే, తెచ్చి, మండె కట్టాడు దుర్గయ్య. మండె కట్టిన పది రోజులకు మండె విప్పారు దుర్గయ్య దంపతులు. విత్తనాలు మొలకెత్తలేదు. అది చూసి యల్లమ్మ లబోదిబోమని మొత్తుకోసాగింది.

‘ఓర్నాయనో ! అయిబ్రేడు యిత్తనాలని డబ్బుల్దగలేసి తీస్కొచ్చినవు. మొలక సూడబోతే మొత్తానికి మొత్తమే గరిబోయింది. మన కొంపకు నీళ్ళొచ్చినయి. ఇంగ ఏంజేసేదిరా దేవుడా ” శోకం పెంచింది యల్లమ్మ.

తాను తీసుకొచ్చిన విత్తనాలు సరైనవి కావనీ, విత్తన కేంద్రం వారు తనను మోసం చేసారనీ దుర్గయ్య దిగులుతో ఆ రోజు భోజనం చేయలేదు. ‘అయిందేదో అయింది’ అనుకొని మొలకొచ్చినంత వరకు గంపల్లో ఎత్తుకొని పొలంలో చల్లాడు దుర్గయ్య. పొలంలో చాలా భాగం ఖాళీగా ఉండటం చూసి, ఊళ్లోని ఆసాముల్నందర్ని విత్తనాల వడ్లు కావాలని అడిగాడు. ఎవరూ ముందుకు రాలేదు. మరలా షావుకార్ని బతిమలాడి అప్పు కింద విత్తనాల వడ్లు తీసుకున్నాడు. వాటిని నానబోసి వచ్చిన మొలకని మిగతా పొలంలో చల్లాడు దుర్గయ్య.

మొలక నాటేసింది మొదలు, రకరకాల ఎరువులు వేయాల్సి వచ్చింది. దుర్గయ్యకు దిగులు పెరగసాగింది.

“ఎట్లనో అట్ల డబ్బు గుంజుకొచ్చి,

పెట్టుబడైతే పెడ్తున్నా. రేపొద్దున గింజలెల్లబోతే, ఉరిబెట్టుకుండుడే మిగులుద్ది..."

ఇదిలా ఉండగా, చెరువులో నీళ్లు బాగా తగ్గి, అరకొరగా పంట పొలాలకు రాసాగాయి. దుర్గయ్య పొలం తూముకు సమీపాన ఉండటం మూలాన నీళ్లకు కొరత లేదు. దుర్గయ్య పొలాన్ని దాటి దొర పొలానికి నీళ్లు పారాల్సి ఉంది. ఎప్పుడు కూడా దుర్గయ్య పొలం నీళ్లతో నిండి ఉండటం దొరకు కంటకింపుగా ఉండేది. దానికి తోడు ఏదో విషయంలో దొరకు దుర్గయ్యపై కోపంగా ఉంది. ఎలాగైనా దుర్గయ్య పొలానికి నీళ్లు రానీయొద్దని నిర్ణయించుకున్నాడు దొర. ఓ రోజు,

"దుర్గా ! సెర్ల నీళ్ల సానా తక్కువగా కనపడ్తన్నయ్. సెర్వు నీళ్లు నాపొలానికి పెట్టినంక, నీ పొలానికి పారించుకో" అన్నాడు దొర.

"గదేంది దొరా ! నా పొలం తూము ముంగలుంది. మొదగాల నీళ్లు నా పొలానికి పారినంకనే మీ పొలానికి వస్తయి" అన్నాడు దుర్గయ్య.

"గదేం కుదర్దు. పొద్దస్తమానం నీళ్ళు నా పొలం పారాల. రాత్రికి నువ్వు పెట్టుకో"

"గిది అన్యాయం దొరా. నాదేపాటి పొలం? మీరు నెనరు జేయాల" ప్రాధేయ పడ్డాడు దుర్గయ్య. దొర మనసు కరగ లేదు.

"దుర్గా నీ పొలం పారాలంటే రాత్రి పూట నీళ్లు పెట్టుకో. పొద్దుందాక మా పొలం పారనీ" దొర కటువుగా చెప్పాడు.

చేసేదేమి లేక రాత్రి వేళ తన పొలానికి నీళ్లు పెట్టసాగాడు దుర్గయ్య. దొర తన జీతగాళ్లను దుర్గయ్య పొలానికి గండ్లు పెట్టమని ఆజ్ఞాపించాడు. తెల్లవారే సరికి తన పొలంలో నీళ్లు లేకపోవడం, పొలం గట్లు తెగి ఉండడం, దుర్గయ్యకు దొర కుయుక్తి అర్థమైంది.

"ఈ దొరాయన సన్నెన్నాళ్లగైనా అప్పుల పాలు చేయాల్నని అనుకున్నట్లుంది. పైసలున్నోళ్ల తోటి పంచాయితీల నెగ్గలేం" అనుకొని, షావుకారు ఇంటికి వెళ్ళాడు దుర్గయ్య. షావుకారు పొలానికి చెరువు నీళ్లు పారటం మూలాన ఆయన కరంటు మోటారు ఖాళీగానే ఉంది. దుర్గయ్య పూర్వీకులెవరో తీసిన పొలం బావికి కరంటు మోటారు బిగించి పొలానికి నీళ్లు పెట్టాలని దుర్గయ్య ఆలోచన. ఎలాగైతేనేం, మోటారు కిరాయికి మాట్లాడి తన బావిపై బిగింపజేయించాడు దుర్గయ్య.

వరి పొలం చేస్తుండగానే 'పొట్టకు' వచ్చింది. అది నీళ్లు బాగా అవసరం అయ్యే సమయం. లో వోల్టేజి సమస్య ఉండడం మూలాన, రాత్రివేళ దుర్గయ్య మెలకువగా ఉండి పొలానికి నీళ్లు పెట్ట సాగాడు.

ఉన్నట్లుండి ఓ రోజు కరెంటు ఆఫీసు నుంచి 'లైన్మను' వచ్చాడు. పంచాయితీ ఆఫీసు గదిలో బస చేసాడు. దొర లైన్మన్ను కలిశాడు. భోజనం పంపించే ఏర్పాటు చేశాడు దొర. దొర లైన్మను దగ్గర సెలవు తీసుకొన్న కొద్ది సేపటికి దుర్గయ్యకు పిలుపొచ్చింది.

"ఏం పేరు"

"దుర్గయ్యండీ"

"కరంటు సాంచను లేకుండానే మోటరు నడిపిస్తన్నవటగా? గవర్నమెంటు సొమ్ము పుణ్యానికొచ్చిందా ? నీ మోటరు జప్తు జేత్త. పోలీసు కేసు పెడ్త. యాడుందో నీ మోటరు సూపిద్దువు పా" కుర్చీలోంచి లేచాడు లైన్మను.

దుర్గయ్య ప్రాణాలు పోతున్నట్లుగా ఫీలయ్యాడు. "లేద్సార్. గట్ల అనకండి. వరిపొలం పొట్టకొచ్చింది. సేతికొచ్చింది కాకుంటైద్ది. అందుకే మోటారు బిగించిన బాంచను. తమరు దయ సూపించాల" ప్రాధేయపడ్డాడు దుర్గయ్య.

లైన్మను కాసేపు అదరించి, బెదిరించి, చివరికి

"అఁ సరేగని. కోళ్ళను లెస్స సాత్తన్నవటగా. ఓ రెండు మంచి కోడిపుంజుల పంపియ్యి" ఆజ్ఞాపించాడు లైన్మను.

దుర్గయ్య 'సిత్తం' అంటూ యింటికి పరుగెత్తాడు.

రెండు మూడు రోజులు అలా గడిచాయో లేదో ట్రాన్స్‌ఫార్మర్ కాలి పోయింది. అన్ని మోటర్లు బందు అయ్యాయి. ఆసాములంతా కలిసి తలో అయిదు వందల రూపాయలు వేసుకొని కరెంటు ఆఫీసుకు వెళ్ళాలని నిర్ణయించుకున్నారు. దుర్గయ్య కరంటు మోటారు వాడుతున్నాడు కాబట్టి అతన్ని కూడా డబ్బు తీయమన్నారు. దుర్గయ్యకు డబ్బులెందుకీయాలో అర్థం కాలేదు.

"డబ్బెందుకే? కరంటోళ్ళు ఫిట్టు చెయ్యరా" అడిగాడు అమాయకంగా.

అది విన్న పెద్దాయన,

"ఓర్నీ! లోకం ఎట్ల నడుస్తందో తెల్వదా బిడ్డా? కరంటోళ్ళ సేతులు తడపందే పని సేత్తరా" అసలు విషయం చెప్పాడు పెద్దాయన.

దుర్గయ్యకు తప్పలేదు. మరలా షావుకార్ని అడిగి అయిదొందలు అప్పుగా తీసుకొచ్చి డబ్బులు వసూలు చేస్తున్న ఆసామికి ఇచ్చాడు.

చూస్తుండగానే వరి 'ఎన్నువిరవటం', కోయటం, కుప్ప కొట్టడం అయిపోయాయి.

కల్లంలో వడ్లు తూర్పార పడుతుండగా, షావుకారు కిరాయి ట్రాక్టరు తీసుకొని కల్లం దగ్గరకి వచ్చాడు. వస్తూనే దుర్గయ్యను, 'వడ్లు పోతమైనాయా' ప్రశ్నించాడు.

షావుకార్ని చూస్తూనే దుర్గయ్యకు గుబులుగా అనిపించింది. కల్లంలోంచే వడ్లు తీసుకెళ్ళటానికి వచ్చాడని దుర్గయ్య అర్థం చేసుకున్నాడు.

""పోతమైనట్లే! ఈ ఏడు అన్నీ ఇబ్బందులే అయినై. కొంతకాలం ఆగకూడదా తమరు" బతిమలాడే ధోరణి వ్యక్తపరిచాడు దుర్గయ్య.

"గదేమాట. పైసలు తీస్కపోయేటప్పుడు తెల్వదా? బాకీ కింద వడ్లు కొల్చుకపోతా" అన్నాడు షావుకారు కఠినంగా.

అన్నదే తడవుగా, రాశికి కుంచం వేసి కొలవటం మొదలు పెట్టాడు షావుకారు.

దుర్గయ్యకు నోటమాట పెగలలేదు.

"ఆరుగాలం సేత ఒక్క గంటలో షావుకారు మింగుడు" మనసులో అనుకుంటూ కల్లం బండపై చతికిలబడ్డాడు దుర్గయ్య.

షావుకారు అసలు వడ్డీలు కలుపుకొని బాకీ కింద తీసుకపోయిన వడ్లు కాక, కొద్దిగా మిగిలాయి. వాటిని దుర్గయ్య దంపతులు చెరో గంపలో ఎత్తుకొని ఇంటి ముఖం పట్టారు.

ఆ రోజు రాత్రి దుర్గయ్య, యల్లమ్మతో, "మనూళ్ళనే ఉంటే మనం ఆకలి సావు సావాల్సి వస్తది. ఊరొదలి పోరన్ని తీస్కొని పట్నం బతకబోదం. ఇటుకలు మోసి బతుకెళ్ళదీద్దాం" అన్నాడు. యల్లమ్మకు ఊరిని వదలాలంటే దిగులుగా అనిపించింది. అయినా తప్పనిసరి కాలావసరం అది.

* * *

అక్కడ పట్నం వచ్చిన దుర్గయ్య దంపతులకు కాలం త్వరగా గడిచిపోతున్నట్లనిపించింది. చూస్తుండగానే తమ కళ్ళ ముందు ఎన్నో బిల్డింగులు రూపుదిద్దుకున్నాయి. మొదట సపోర్టు మీద నిలబడి, ఇటుకలు అందియ్యటం ఇబ్బందిగా అనిపించేది దుర్గయ్యకు. ప్రతిరోజు యల్లమ్మ జాగ్రత్తలు చెబుతుండేది.

ఓ రోజు దుర్గయ్య కట్టెల మీదుండి తాపీ పని చేస్తుండగా, క్రేను కొక్కెం వదులై విసురుగా వచ్చి దుర్గయ్యను తాకింది. రెండతస్తుల ఎత్తు నుంచి 'అమ్మా' అంటూ దుర్గయ్య నేలకూలాడు. దూరంగా పని చేస్తున్న యల్లమ్మ గుండెలు బాదుకుంటూ వచ్చింది. రక్తపు మడుగులో విలవిల్లాడుతూ ప్రాణం వదిలాడు దుర్గయ్య.

కంట్రాక్టరు, పోలీసులు వచ్చారు. తోటి కార్మికులు లక్ష రూపాయలు నష్టపరిహారంగా యల్లమ్మకి ఈయాలని అన్నారు. కంట్రాక్టరు, పోలీసుల్తో లాలూచీపడి పదివేల రూపాయలు ఇచ్చాడు.

యల్లమ్మకు పట్నం దగాకోరులా కనిపించింది. చుట్టూ వున్న మనుషులు అదోలా కనిపించారు. ప్రతిరోజూ నవ్వుతూ తన భర్తను పలకరించి, అది ఇది మాట్లాడిన కంట్రాక్టరులో కొత్త వ్యక్తి కనిపించాడు యల్లమ్మకు. ఆమె పట్నంలో ఉండదలుచుకోలేదు. కలోగంజో తాగి ఉన్న ఊళ్లోనే కాలం వెళ్ళదీయాలని నిర్ణయించుకుంది యల్లమ్మ. తక్షణమే తన పదిహేనేళ్ళ కొడుకుని తీసుకొని ఊరుకు ప్రయాణమైంది.

* * *

కాలం గడవ సాగింది. వర్షాకాలం ఆరంభ సూచకంగా నల్ల మబ్బులు గుడిగూడి గరగరమనసాగాయి.

ఇంటి కడపకు ఆవల కూర్చొని చేతికందిన రాళ్ళను విసిరేస్తూ ఆకాశం వైపు చూడసాగింది యల్లమ్మ. తల్లిని చూసి "ఏందమ్మా! దిగులుగా కూకున్నావు" అడిగాడు దుర్గయ్య కొడుకు.

ఆలోచన తెగిపోయి కొడుకువైపు చూసింది యల్లమ్మ. దుర్గయ్య పాడిన పాట ఆమె చెవుల్లో ప్రతిధ్వనించ సాగింది.

"సిరిమల్లె చెట్టు కింద లచ్చుమమ్మో
సినబోయి కూకున్నవెందుకమ్మో..."

"అమ్మా! నవ్వుడు సెయ్యవేంద్దే" ప్రశ్నించాడు, యల్లమ్మను కొడుకు.

యల్లమ్మ కొడుకు వైపు చూసింది.

మూలన వున్న మగ్గాన్ని సరి చేయసాగాడు కొడుకు. కొడుకును తదేకంగా చూస్తున్న కొద్దీ ఆమె ముఖంలో దిగులు మాయమై చిరునవ్వు చోటు చేసుకోసాగింది. ◆

తప్పకుండా చదివి మర్చిపోవాల్సిన నవల 'బెస్ట్ సెల్లర్'

బెస్ట్ సెల్లర్
రచన : సి.వి.రావు
వెల : రు. 40/-;
ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్

కొన్ని పుస్తకాలకు రాసిన ముందుమాటో, ఎనక మాటో చదవగానే సారాన్నంతా రంగరించి కలబోసుకొని తాగినట్లన్పిస్తుంది. అప్పటితో ఉన్న ఓపిక కాస్తా సన్నగిల్లి ఈ రోజుకిది చాల్లే అన్పించి పుస్తకం మూసేస్తాం. అలా అని కనీసం రచయిత/కవి గురించిన నాలుగు మాటలు చదవందే విషయంలోకి వెళ్ళడమూ కష్టమే. ప్రముఖ రచయితో, కవో అయితే ఆ నష్టం నుండి కాస్త రిలీఫ్ ఉంటుంది. ఈ మధ్య కాలంలో పుస్తకాలు కొనుక్కొని చదివే పాఠకులు తగ్గారని, తగిన ప్రత్యామ్నాయం చూడకపోతే ఈ రంగంలో నిలబడ్డం కష్టమేనని కొందరు ఇప్పటికే చెవులు కొరుక్కుంటున్నారు.

ఇంతలాంటి ఈ గడ్డు పరిస్థితిలో కచ్చితంగా పేరులోనే వెరయిటీతో సి.వి.రాము ఓ 'నవల'ను అచ్చేయించారు. నవల మొత్తంగా నూటపన్నెండు పేజీలు, ముందు, ఎనక మాటల్లేవు. ఎతుకుతున్న రాజమార్గం చూడగానే కన్పించినట్లు అట్ట తెరవగానే విషయ ప్రవేశం కన్పిస్తుంది. మొత్తం నవల చదివిన తరువాత దీనికి పరిచయ వాక్యాలు లేకపోవడమే ఉత్తమంగా తోచింది నాకు. అన్నింటినీ విప్పి చెబితే అటెన్షన్ ఏముంటుందనుకున్నారేమో రచయిత.

చాలా స్పష్టంగా తను రాయాలనుకున్న విషయాల్ని ట్రాక్ తప్పించకుండా చివరికంటూ స్ట్రయిట్‌గా నడిపించడంలో చక్కని నేర్పును ప్రదర్శించారు రచయిత. అక్కడక్కడా తన సిద్ధాంతాన్ని కూడా పాత్రల చేత చెప్పించారు. ఇది పాత పద్ధతే అయినా చెప్పించిన రీతి నెగెటివ్‌గా ఉండటంతో కొంత ఆసక్తి అన్పించింది. ఈ నవలలో ప్రధాన పాత్ర కృష్ణారావు. బ్యాంకులో చిరుద్యోగి. కాస్తంత పైత్యం ఉన్న వ్యక్తి. సాధ్యమైనంత తొందరగా ప్రముఖ రచయితగా పేరు సంపాదించాలని ఆశపడ్డాడు. ఆశపడటంలో తప్పులేదుగానీ అడ్డదారుల్లో ప్రయాణించడం, దానికోసం డబ్బు ఖర్చు పెట్టి తన కథలకు, నవలలకు బహుమతులు తెప్పించుకోవడం తప్పు. కానీ అది కృష్ణారావుకు మాత్రం తప్పుగా అన్పించదు. అదీగాక సాహిత్యం ఓ బిజినెస్ అనీ, బిజినెస్‌లో ఇలాంటివి మామూలే అని ఓ సిద్ధాంతం సృష్టిస్తాడు. చివరికి సిద్ధాంతాన్ని తను నడిపిస్తున్నాడో, తనను సిద్ధాంతం నడిపిస్తుందో తెలియని అయోమయంలో పడ్తాడు. ఇక్కడ రచయిత కూడా తడబడ్డారు. నేర్పుగా తేరుకొని విషయాన్ని ప్రదానం చేయడంలో కృతకృత్యులయ్యారు.

ఇక ఇతర పాత్రల్లో ప్రధానమైనవి సారధి. కృష్ణారావు సహోద్యోగి. అతనూ రచయితే. కానీ డబ్బులిచ్చో, మందు పార్టీలిచ్చో తన కథలు అచ్చు వేయించుకోవాలనే ఉద్దేశం లేని వాడు. అభ్యుదయ భావాలు గలవాడు. ఇతనంటే కృష్ణారావుకు గిట్టదు. కృష్ణారావు దారి మంచిది కాదన్న విషయం పలుసార్లు చెప్పి విఫలమవుతాడు. 'శకుంతల' మరో పాత్ర. కన్పించిన ప్రతిసారీ ఓ బాంబులా తను చెప్పాలనుకున్న మాటల్ని చెప్పేస్తుంది. మహిళా నాయకురాలు. ఓ సందర్భంలో ఓ మహిళకు జరిగిన అన్యాయం గురించి నిజనిర్ధారణ కమిటీలోకి రచయితల నుంచి కృష్ణారావును ఆహ్వానిస్తుంది. కృష్ణారావు అయిష్టంగానే ఒప్పుకొంటాడు. సారధి, శకుంతల, తదితర పాత్రలతో కలిసి సంఘటనా ప్రాంతానికి వెళ్తాడు కృష్ణారావు.

కృష్ణారావు అక్కడ వాతావరణాన్ని, పల్లెల్లో ఉన్న దరిద్రాన్ని, పల్లె వాసుల అమాయకత్వాన్ని చూసి మారిపోతాడు. కానీ క్షణాల్లో తన మనస్సులో మహారచయిత, గొప్ప రచయిత కావాలనే కోరిక పురి విప్పుతుంది. ఇదంతా రాజకీయమనీ, రాజకీయంతో సంబంధం అంటే తన లక్ష్యానికి అడ్డని భావించి రాత్రికి రాత్రే చెప్పకుండా వస్తాడు. ఆ తరువాత శకుంతలకు, కృష్ణారావుకు జరిగిన సంభాషణ ఈ మొత్తం నవలకు అగ్రభాగంగా నిలుస్తుంది. ఇంకా ఈ నవలలో అనేక చిన్న చిన్న పాత్రలు ఉన్నా అంత ఐడెంటిటీ ఉన్నట్లుగా కనిపించవు.

ఈ నవలకు 'బెస్ట్ సెల్లర్' అని పేరు పెట్టడంలో కొంత ప్రత్యేకంగానే కన్పిస్తుంది. మొత్తానికి ప్రస్తుతం రచయితల తహతహలు, కవుల డొల్లతనాలు (కొందరివి) విష సాహిత్యానికి బీజాలు పడుతున్న వాతావరణాన్ని చక్కగా చూపించారు రచయిత సి.వి.రావు. కానీ కొన్నిచోట్ల ఎబ్బెట్టు సంభాషణలు, హిపోక్రసీ పాఠకుడికి ఏమంత మంచిగా అన్పించదు. ఇది ఎంతదాకా వచ్చిందంటే కొన్ని నెగిటివ్ డైలాగ్స్ (ముఖ్యంగా కమ్యూనిస్టుల గురించినవి) రచయిత అభిప్రాయాలా? లేక పాత్ర అభిప్రాయాలా? అన్న అయోమయంలో పాఠకుడు పడేంతగా ఉన్నాయి. మొత్తానికి నిశ్శబ్దంగానే వచ్చినా కొంత చలనాన్ని ముఖ్యంగా కవులు/రచయితలు కావాలనుకునే కొత్తవారు ఒకసారి చదివి మర్చిపోవాల్సినంత ఉందని చెప్పొచ్చు.

- వేము

స్వీకారం



యుద్ధనేరస్థులు
బుష్-బ్లెయిర్
రచన : ఎబికె ప్రసాద్; **వెల :** రు. 15/-;
ప్రతులకు : ప్రజాపంథా, నవోదయ బుక్‌హౌస్, సహచర బుక్ మార్క్, దిశ పుస్తక కేంద్రం హైదరాబాద్; ప్రజాశక్తి, విశాలాంధ్ర బుక్‌హౌస్‌ల అన్ని బ్రాంచీలు; మైత్రి బుక్‌హౌస్, విజయవాడ; మణిబుక్‌స్టాల్, నెల్లూరు.

దుగిలి దళిత కవిత్వము
రచయిత : భూతం ముత్యాలు; **వెల :** రు. 25/-;
ప్రతులకు : భూతం ముత్యాలు (టీచర్) ఇ.నెం. 8-98, కరెంటు సబ్-స్టేషన్ పక్కన, నాంపల్లి, నల్గొండ జిల్లా; నవోదయ బుక్‌హౌస్, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, ప్రజాశక్తి, సహచర, దిశ పుస్తక కేంద్రం

మేల్‌కొలుపు
రచయిత : అరుణ్ సాగర్;
వెల : రు. 25/-;
ప్రతులకు : ప్రజాశక్తి, విశాలాంధ్ర అన్ని బ్రాంచీలు, ప్రసన్న, 8-3-231/ఎ/25, కృష్ణానగర్, యూసఫ్‌గూడ, హైదరాబాద్.

కళ ద్వారా అటు వినోదాన్ని ఇటు సామాజిక చైతన్యాన్ని ప్రబోధించే కళాకారులు బహు అరుదుగా ఉంటారు. మాయలు మంత్రాలంటూ అవతారాలెత్తి సమాజానికి కీడుచేసే దొంగ సాధువుల బారిన పడకుండా ప్రజల్ని చైతన్యం చేయడానికి తన కళను సంపూర్ణంగా ఉపయోగిస్తున్న ఆ కళాకారుని పేరు మ్యాజిక్ గౌతమ్. రోడ్డు ప్రక్క గారడీవాళ్ల దగ్గర చిన్నతనంలోనే మ్యాజిక్ ట్రిక్స్‌ను పసిగట్టి క్రమంగా ఇంద్రజాల కళపట్ల ఉత్సాహంతో మ్యాజిక్ కళాకారునిగా ఎదిగిన గౌతమ్ వందలాది ప్రదర్శనలతో జాతీయ కళాకారునిగా రాణిస్తున్నారు. మ్యాజిక్ కళద్వారా మూఢనమ్మకాలను పారద్రోలడమే నా లక్ష్యమంటూ నినదించే మ్యాజిక్ గౌతమ్‌గురించి మరిన్ని వివరాలు ఈ వారం తెలుసుకుందాం.

మూఢనమ్మకాలపైనే నా గురి

మ్యాజిక్ గౌతమ్

వ్యక్తిగత వివరాలు

1959 సంవత్సరం, విశాఖ జిల్లా పద్మనాభ మండలం, మద్ది గ్రామంలోని ఆదెమ్మ అప్పలనాయుడు దంపతులకు జన్మించిన గౌతమ్ అసలు పేరు గురునాయుడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా ప్రాథమిక విద్యనభ్యసిస్తూనే బాలకార్మికునిగా కూలి చేశారు. 14వ ఏట, రోడ్డుమీద ఎవరో చేస్తున్న గారడీ ప్రదర్శన చూసి ఆకర్షితుడైన గౌతమ్, వారితో స్నేహంచేస్తూ గారడీ విద్యలో ప్రాథమిక మెళకువలు తెలుసుకున్నాడు. క్రమంగా మ్యాజిక్ కళల నిత్య సాధన చేస్తూ, స్వంత తెలివి తేటలతో ప్రదర్శనాకారుడిగా ఎదిగారు. స్థానికంగానే కాకుండా రాష్ట్రేతర ప్రాంతాలలో సైతం ఇంద్రజాల ప్రదర్శనలనిచ్చే గౌతమ్ రాష్ట్రంలోని ప్రముఖ ఇంద్రజాల కళాకారుల్లో ఒకరిగా ప్రేక్షకులను అలరిస్తున్నారు.

వృత్తి కళాకారునిగా ఎదిగిన తీరు..

1979 సంవత్సరంలో ఐ.ఎఫ్.టి.యు(భారత కార్మిక సంఘాల సమాఖ్య)లో చేరి కార్మిక సమస్యలు, హక్కుల కోసం పనిచేశారు. ఆ క్రమంలో ప్రగతిశీల విద్యార్థి సంఘం, ప్రగతిశీల యువజన సంఘం తదితర సంఘాలతో అనుబంధం పెంచుకొన్నారు. 1985 సంవత్సరంలో పి.డి.ఎస్.యు విలేజ్ క్యాంప్‌లో పాల్గొని మూఢనమ్మకాలపై మొదటి మ్యాజిక్ ప్రదర్శననిచ్చి తన కళాప్రస్థానాన్ని ఆరంభించారు. విజయవాడను నివాస స్థలంగా మార్చుకొని మిమిక్రీ కళాకారుడు సిల్వర్‌స్టర్‌లాంటి ప్రముఖులతో పరిచయాలు పెంచుకొని వృత్తి కళాకారుడిగా రాణిస్తున్నారు.

మ్యాజిక్ అంటేనే రిస్క్

మ్యాజిక్ కళను ప్రదర్శించడమంటే ఒకరకంగా గుండె ధైర్యంకావాలనే గౌతమ్ తన



అనుభవాలను చెబుతూ.. ప్రజల్లోని మూఢనమ్మకాలను పోగొట్టాలనే ప్రయత్నంలో తమ ప్రాణాలు కూడా ఒక్కోసారి పణంగా పెట్టవలసి వస్తుందని, చేసే మ్యాజిక్ అంశాల్లో వినోదంతో పాటు రిస్క్, పైగా ఒక్కోసారి ప్రజలనుండి వ్యతిరేకత కూడా ఎదుర్కోవలసి వస్తుందని అంటారు. దీనికి ఉదాహరణగా 'నీవే మంత్రగాడివంటూ కొంతమంది ఛాందసవాదులు నిప్పుల్లోకి విసిరేయబోగా ఆఖరినిముషంలో తప్పించుకోవడం జరిగిందని' గౌతమ్ చెబుతుంటారు. బాణామతి పేరిట అమాయకులను చంపడంవంటి సంఘటనలకు వ్యతిరేకంగా ప్రదర్శనలివ్వడంలో రిస్క్ ఉన్నా మానసికంగా తృప్తి మిగులుతుందని, ఇదే క్రమంలో భవిష్యత్‌లో కూడా నా ప్రదర్శనలు ఉంటాయని గౌతమ్ ఆత్మవిశ్వాసంతో చెబుతూ ఉంటారు.

మ్యాజిక్ ప్రత్యేకతలు.. సత్కారాలు

దొంగ స్వాములు చేసే గారడీలు నిజంకావని నిరూపించే అంశాలకు గౌతమ్ ఎక్కువగా ప్రాధాన్యతనిస్తారు. వాటిలో గాలిలో విభూదిని, లింగాలను సృష్టించడం, మంటల్ని మింగడం, శూన్యంలోంచి బంగారు గొలుసులు తీయడంవంటి అంశాలు బాబాల బండారాన్ని బట్టబయలు చేస్తాయి. అలాగే గాల్లో మనిషిని ఉంచడం, నిట్టనిలువుగా ఉంచిన కత్తిపై బాలికను పరుండబెట్టటం, ఖాళీ పేపరునుంచి వందలాది గ్లాసులు బయటకు తీయడంవంటి ఆధునికమైన మ్యాజిక్ అంశాలతో కూడా గౌతమ్ ప్రేక్షకులను అలరిస్తూ ఉంటారు. ఇప్పటికే వందలాది ప్రదర్శనలు పూర్తి చేసుకున్న గౌతమ్ లెక్కలేనన్ని సత్కారాలు, సన్మానాలు పొందారు. ఆంధ్రప్రదేశ్ ఇంద్రజాల కళాకారుల సంఘానికి ఉపాధ్యక్షులుగా పనిచేసిన గౌతమ్ ప్రస్తుతం ఆలిండియా పీపుల్స్ మ్యాజిక్ సర్కిల్ సంస్థకు సహాయకార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. మ్యాజిక్ కళ ద్వారా సమాజంలోని రుగ్మతలను దూరంచేయవచ్చుననే సంకల్పంతో ఇంద్రజాల ప్రదర్శనలిస్తున్న 'మేజిక్ గౌతమ్' మరిన్ని ప్రయోజిత కార్యక్రమాలతో ఇంద్రజాల కళల్లో రాణించాలని కోరుకుందాం. ◆

* పొత్తూరి రాజేంద్ర ప్రసాద్ వర్మ

పోలీసుకు నిరాశగా ఉంది. శరీరమంతా విపరీతమైన నిస్సత్తువ ఆవరించింది. ఏ పనీ చేయాలని అనిపించలేదు. నిరుద్యోగ రాక్షసి కబంధ హస్తాల్లో ఇరుక్కుపోయి చెరకు పిప్పిలా అయిపోయినట్లుగా వుంది.

మంచం మీద నుంచి లేవాలని అనుకోలేదు.

ముప్పయి ఏళ్ళ వయసు మీద పడింది. చేయని ఉద్యోగ ప్రయత్నం లేదు. వెళ్ళని కార్యాలయం లేదు. ఎక్కడ చూసినా నో వేకెన్సీ బోర్డు కనిపిస్తోంది.



ఆకలి రాజ్యంపై విజయం

పాసైన సర్టిఫికెట్లను చూపిస్తూ బ్రతిమలాడుకుంటున్నాడు. ఉపాధి కల్పించమని వేడుకుంటున్నాడు. అయినా ఫలితం ఉండటం లేదు. ఎవరూ కనికరించడం లేదు.

'ఎన్నాళ్ళయినా నిరుద్యోగిగా ఉండిపోవలసిందేనా? ఉద్యోగం తనకు ఎండమావేనా?' పోలీసులో ఆలోచనలు...

నిద్రలేచి ఏమి చేయాలి?

ఏ పని ఉందని లేచి తయారవ్వాలి

ఆలోచిస్తూ పడుకున్నాడు పోలీసు.

"ఏరా పోలీసూ! ఎనిమిది గంటలు అవుతున్నా ఏమిటా నిద్ర... లేచి మొహం కడుక్కో..." అమ్మ వచ్చి లేపింది.

కళ్ళు విప్పి ఆమె వైపు చూశాడు.

తన ఉద్యోగం కోసం ఆమె మొక్కని దేముడు లేదు. వెళ్ళని గుడి లేదు... మాతృ హృదయం ఎంత తల్లడిల్లుతుందో... పోలీసు దుప్పటి తొలగించి మంచం మీద కూర్చున్నాడు..

"తొందరగా తయారవ్వు... టిఫిను సిద్ధం చేస్తున్నాను..." అంది.

"గుర్రం గుడ్డిది అయినా దాణాకు లోటు లేదన్నమాట!" పోలీసు తన మీద తానే జోక్ వేసుకున్నాడు.

ఆ మాటలు విని పోలీసు తల్లి మహలక్ష్మి దగ్గరికి వచ్చింది. "తప్పుబాబూ! ఉద్యోగం రాలేదని అంత బాధ పడిపోవద్దు... మా అన్నయ్యకు ఉత్తరం రాశాను.. నీ క్వాలిఫికేషన్‌కు తగిన ఉద్యోగం మామయ్యే చూస్తాడు - నిరాశ పనికి రాదు'' అనునయించింది.

పోలీసు లేచి బాత్‌రూములో దూరాడు.

ఆ తర్వాత అమ్మ పెట్టిన టిఫిన్ తిన్నాడు. బీరువాలో ఉన్న సర్టిఫికెట్లను మరోసారి వరుస మీద పెట్టుకున్నాడు.

"ఎక్కడికైనా వెళతావా?"

"లేదమ్మా! ఎవరి దగ్గరకూ వెళ్ళాలని లేదు. అయినా ఈ జన్మకు ఉద్యోగం రాదులే–" కాగితాల్లో తల దూర్చేశాడు.

మహలక్ష్మి ఏం మాట్లాడలేదు.

కొడుకు పోలీసు పరిస్థితి ఆమెలో దుఃఖాన్ని తెప్పించింది. 'పోలీసు' అన్న పేరు ఆమెకు ఎంతో ఇష్టం. అందుకే ఎవరెన్ని పేర్లు సూచించినా కొడుక్కి ఆ పేరే పెట్టుకుంది.

"బాబూ! నువ్వలా మాట్లాడకురా! నీకూ మంచి రోజులు వస్తాయి. రోజూ నిరాశతో ఇంట్లో ఒంటరిగా ఉండటం ఎందుకు? ఉద్యోగం అవసరమే. రాలేదని బాధ పడటమెందుకు? ఏదైనా సినిమాకు వెళ్ళిరా! మనసు కుదుటపడుతుంది!"

"సినిమాకా?"

"ఏమిటంటే ఆశ్చర్యపోతున్నావు... నక్కాలు ఎగ్గొట్టి సినిమాలు చూడటం మరిచిపోయావా? మార్నింగ్ షోకు ఇంకా టైముంది... బీరువా పక్క పోపుల పెట్టెలో డబ్బులున్నాయి... వెళ్లు!" తల్లి చెప్పింది.

పోలీసు దీర్ఘంగా ఆలోచించాడు.

"వారం రోజులుగా మనసంతా ఆందోళనగా ఉంది. ఏదో కోల్పోయినట్లు అనిపిస్తోంది. సినిమా చూసి ఎన్నాళ్ళయిందో... అమ్మ మాట నచ్చింది - "వెళతానులే!" అంటూ తయారయ్యాడు. డబ్బులు తీసుకుని బైటికి వచ్చాడు.

* * *

కమల్‌హాసన్ నటించిన ఆకలిరాజ్యం సినిమా.

పోలీసు దీక్షగా చూశాడు. అంతకుముందు ఒకసారి చూశాడు. ఇప్పుడు చూస్తున్నప్పుడు కొత్తగా అనిపించింది.

తనలాగే హీరో కూడా నిరుద్యోగి.

ఉద్యోగం రాలేదని దొంగగా మారలేదు. సమాజం మీద కసితో తిరగబడలేదు. సంఘ వ్యతిరేక శక్తిగా మారలేదు. స్వయం ఉపాధి వెతుక్కున్నాడు. క్షురకవృత్తిని స్వీకరించాడు. ఆదాయాన్ని గడించాడు.

సినిమాలో సందేశం నచ్చింది.

వారం రోజులుగా తను పడుతున్న మానసిక వేదనకు అర్థం లేదని అనిపించింది. ఉద్యోగం కోసం తను ఫూలిష్‌గా ఎందుకు ఆలోచించడమని అనుకున్నాడు.

సినిమా గొప్ప రిలీఫ్‌ను ఇచ్చింది.

ఉత్సాహంగా ఇంటికి చేరుకున్నాడు.

ఆకలి మీద ఉన్నాడేమో గబగబా తినడం మొదలు పెట్టాడు.

'బాబూ! నీ గడ్డం బాగా పెరిగిపోయిందిరా! శుభ్రంగా షేవింగ్ చేసుకో... ఈ గెడ్డాలతో నిన్నెవరయినా చూస్తే నిజంగా నిరుద్యోగివని తెలిసిపోతుంది-'' అంది మహాలక్ష్మి.

"షేవింగ్ చేసుకుంటాను కానీ ఓ పదివేలు సర్దుబాటు చేయగలవా?" చేతులు కడుక్కుంటూ పోలీసు తల్లిని అడిగాడు.

కొడుకు మొహంలో ఆమెకు కొత్త వెలుగు కనిపించింది. ఎందుకు అని అడగాలనిపించలేదు.

"ఉద్యోగం కన్నా స్వయం ఉపాధి మిన్న అని తెలుసుకున్నాను... అందుకే డబ్బులు అవసరం..." అన్నాడు.

పెట్టెలో ఉన్న రెండు తులాల బంగారం గొలుసు ఆమె మదిలో మెదిలింది... "తప్పకుండా ఇస్తాను!" అంది.

* * *

శ్రీకాకుళం జిల్లా రాజాంలో వడ్రంగిని సంప్రదించాడు పోలీసు.. తన మనసులో రూపొందిన ఆలోచన తెలియజేశాడు. పోలీసు మనసు గ్రహించిన వడ్రంగి తన చాకచక్యాన్ని అంతా చూపించాడు.

నాలుగు సైకిల్ చక్రాలతో బండి తయారైంది.

ఎక్కడికైనా తోసుకుని వెళ్లడానికి పెద్ద సైజు వల్లబండిలా రూపొందించారు. ఆకర్షణీయమైన రంగుతో అమర్చిన పైకప్పు. చక్రాల బండిపై కుర్చీ... చుట్టూ అద్దాలు... కదిలే సెలూన్ తయారైంది.

షేవింగ్‌కు అవసరమైన సరంజామా

కొనుగోలు చేశాడు... బ్యూటీషియన్ కోర్సులో హెయిర్ కటింగ్ రకాలన్నీ అధ్యయనం చేశాడు. క్షౌరశాలగా తయారైన తర్వాత పని మొదలు పెట్టాడు.

మొదట అందరూ విచిత్రంగా చూశారు.

'ఉన్న ఊరు కన్నా పట్నవాసం మెరుగు' అని ఎవరో సలహా ఇచ్చారు. అంతే నడిచే సెలూన్‌తో సహా విశాఖపట్నం చేరుకున్నాడు పోలీసు.

పెద వాల్తేరు. బీచ్‌రోడ్‌లో మొబైల్‌సెలూన్ ప్రత్యక్షం అయింది. వీధుల్లోకి వచ్చి బట్టలు ఇస్త్రీ చేసే మాదిరి కాలనీలో తిరుగుతూ గృహస్తులకు క్షవరం చేయడం మొదలు పెట్టాడు పోలీసు. పెద్ద పెద్ద సెలూన్‌లలో గంటల తరబడి నిరీక్షించే బదులు ఇక్కడికి వెళ్లడం మంచిదని అందరూ గ్రహించారు.

దీంతో పోలీసు దశ తిరిగింది.

క్షవరం చేయడంలో చెయ్యి కూడా తిరిగింది.

రోజూ వంద నుంచి రెండు వందల రూపాయల వరకూ ఆదాయం లభిస్తోంది.

ఉదయం నుంచి సాయంత్రం వరకూ వీధి వీధి తిరిగి ఎక్కడో ఓ దగ్గర మొబైల్ సెలూన్ ఆపి అందులోనే వంట చేసుకునే ఇల్లు మాదిరి రూపొందించుకున్నాడు.

బండి తయారు చేయడానికి అమ్మ అమ్మిన బంగారు గొలుసు మళ్ళీ అమ్మకు ఇవ్వడం కోసం డబ్బు కూడ బెట్టాడు. పదివేలు కూడిన తర్వాత ఇంటికి ఉత్తరం రాశాడు.,

"అమ్మా! నువ్వు విశాఖపట్నం రావాలి. బీచ్‌రోడ్‌లో ఎక్కడైనా కనిపిస్తాను.. నాకు ఒక అడ్రస్సు లేదు. ఓ వారం రోజులు ఉదయం పూట రామకృష్ణా బీచ్ దగ్గర ఉంటాను.. వస్తావు కదూ?" అని రాశాడు.

మహాలక్ష్మి విశాఖపట్నం వచ్చి కొడుకు స్థితి చూసి ఆశ్చర్యపోయింది. అభినందించింది.

సెలూన్‌లో చిన్న బల్ల తీసి రోడ్డు మీద పెట్టి తల్లిని కూర్చోబెట్టాడు. తర్వాత లోపల పెట్టెలోంచి రెండుతులాల బంగారం గొలుసు తీసి ఆమెకు ఇచ్చాడు.

ఆమెకు నోటి మాట రాలేదు.

పుత్రోత్సాహంతో కళ్ళు వర్షించాయి.

"నీ వంటి కొడుకు ఉండటం పూర్వజన్మ సుకృతంరా!" ఆమె అంది.

పోలీసు ఏమీ మాట్లాడలేదు.

అమ్మను మెల్లగా సెలూన్‌లోకి ఎక్కించాడు.

"అమ్మా! నీ స్ఫూర్తి లేకపోతే నేను నిరాశతో ఆత్మహత్య చేసుకొనే వాడిని.... ఈ అభివృద్ధి అంతా నీదేనమ్మా!" అన్నాడు. పక్కనున్న క్యాష్ బాక్స్ చూపించాడు. దానిపైన ఆమె ఫోటో నవ్వుతూ కనిపించింది.

మరో పక్క క్షవరసామాగ్రి పెట్టె ఉంది.

ఆ పెట్టెపైన తలుపుకు వాల్‌పోస్టర్ ఉంది.

అది ఆకలిరాజ్యం సినిమా పోస్టర్.

ఆ పోస్టర్‌లో హీరో కమల్‌హాసన్ నవ్వుతున్నాడు. అతడిని చూస్తుంటే తన కొడుకు కూడా కమల్‌హాసన్‌లాగా ఆమెకు అనిపిస్తున్నాడు. ◆

కాయకల్ప చికిత్స

బోర్డాఫ్ డైరెక్టర్స్ మీటింగ్ జరుగుతోంది. అంతా సీరియస్‌గా చర్చిస్తున్నారు. వారి సంస్థలో ఒక యూనిట్ నష్టాల్లో నడుస్తోంది. ఆ సమస్యే ప్రస్తుత ఎజెండా.

"యూనిట్‌ను మూసేయడం తప్ప గత్యంతరం లేదు" ఒకాయన అన్నాడు.

మిగతావాళ్లు మౌనందాల్చారు. ఒక యువడైరెక్టర్ అన్నాడు " ఎంతోకాలంగా పనిచేస్తున్న అక్కడి సిబ్బందిని ఏం చేస్తాం ?"

"ఏం చేస్తాం ? తొలగిస్తాం.." మరొకరి జవాబు.

"అంత ఈజీయా.. వందల కుటుంబాలను కరివేపాకులా తీసేయడం సరైంది కాదేమో "

"కరివేపాకంటేనే అర్థం అది కదా ! సంస్థ పరిస్థితిని పాజిటివ్ దృష్టిలో అర్థం చేసుకోవాలి".

" ప్రత్యామ్నాయం ఆలోచించండి"

"ఏవో కాయకల్ప చికిత్సలతో లాభం లేదు" మరెవరో అన్నారు.

"నష్టాల వైపు చూస్తూ మూసివేత దిశగా ఆలోచిస్తున్నాం. మన ఆలోచనల తీరులోనే తప్పుంది " యువడైరెక్టరన్నాడు.

అందరూ అతని వైపు చశారు.

" కష్టాలకు కారణాలేంటో వెలికితీయాలి. లాభాలకు మార్గాలేమిటో అన్వేషించాలి. కారణాలను అధిగమించడం, మార్గాలలో దూసుకుపోవడం చేయాలి. వాస్తవికంగా పాజిటివ్ దృష్టి ఇదే !"

'బోర్డే పంచకోల కషాయం ఉంది. ఇది ఒక పట్టున తెగదు' మరెవరో సభ్యుడు గొణుక్కోవడం వినిపించింది.

* * *

పాజిటివ్ దృష్టి సాపేక్షం. దాని లోతుల్లోకి, చర్చలోకి వెళ్లడం లేదు మనం. డైరెక్టర్లు వాడిన కొన్ని జాతీయాల గురించి తెలుసుకుందాం.

కాయకల్ప చికిత్స.., కరేపాకు, పంచకోలకషాయం లాంటి పలుకుబడులను వారు ఉపయోగించారు. వాటి గురించి తెలుసుకుందాం.

'పంచకోల కషాయం' అనే పదాన్ని నెగిటివ్ అర్థంలో వాడతారు. దీన్ని పంచకూళ్ల కషాయం అని కూడా వాడతారు. వేర్వేరు పదార్థాల చేదు మిశ్రమంగా పొల్చుతూ చెప్పే మాట ఇది. వేర్వేరు రకాల, స్వభావాల వ్యక్తుల సమూహం, కుటుంబ సమావేశం, గ్రూపులను ఉద్దేశించి అనే మాట ఇది.

పంచకోల కషాయం అంటే ఏమిటి ? అనేది ప్రశ్న.

పంచ అంటే ఐదు. కోల అంటే రేగు. (లేదా కూడు అంటే అన్నం) కషాయం అంటే వాటి కలయికతో రూపొందినది. చేదయినది.

ఐదు రకాల రేగు పళ్ల కలయికా ? ఐదు రకాల అన్నాల కలయికా ? తేలాల్సిందిదే.

పోతన భాగవతంలో ...

" గూలలకిచ్చియప్పడుపు గూడు భుజించుట కంటే హాలకులైననేమి ? అంటూ పాల్గొన్న దాంట్లో కూల శబ్దాన్ని చెడుకు పర్యాయంగా వాటినట్లు కనపడుతోంది.

అంటే ఐదు చెడ్డగుణాల కలయికా ? అనే అనుమానం వస్తున్నది. అలాకాక ఐదు ద్రవ్యాలను కలిపి పంచకోలమంటారనే వాదన ఉంది.

" పిప్పలీపిప్పలీమూలం చవ్య చిత్రక నాగరై ఏకత్ర మిశ్రితం చైభిః పంచకోలిక ముభ్యతే .."అని అయితే అత్యధికులు కోలయని 'రేగు' అర్థలోనే వాడారు.

కానీ, ఈ ద్రవ్యాలలో 'రేగు' లేదు.

ప్రసవించిన స్త్రీకి పైన పేర్కొన్న ద్రవ్యాలతో కూడిన మందును ఇస్తారనేది కొందరి అభిప్రాయం.

ఏదేమైనా ఇది వైద్య సంబంధంగా.. 'కషాయం'గానే వచ్చిందనేది ఎక్కువమంది అభిప్రాయం. కషాయం రుచిగా ఉండదు కాబట్టి కాలక్రమేణా ఆ రుచి తొలగించే వ్యక్తులు, సమూహాలను ఉద్దేశించి 'పంచకోల కషాయం' అనే వాడుక వచ్చిందనేది వారి భావన. మొత్తంమీద సామాన్య జనం వాడుకలోని పలుకుబడి ఇది.

'కాయకల్ప చికిత్స' కూడా వైద్య సంబంధమైన పలుకుబడే. శాస్త్రబద్ధత లేకుండా చీకట్లో రాయి విసిరినట్లు చేసే ప్రయత్నాలను 'కాయకల్ప చికిత్స' అంటారు. శిష్ట వ్యవహారికుల మాటల్లో ఎక్కువగా దొర్లే ఈ జాతీయాన్ని పత్రికల వారు పాపులర్ చేశారు. ఏవో కాయలు, గింజలలో ఏదొక కాంబినేషన్‌లో రూపొందించి చేసే పురాతన ఔషధ ప్రయోగాల నుంచి పుట్టిందిది. సమస్య నుండి గట్టెక్కించడానికి ఆలోచించే వీలయింది చేసే ప్రయత్నాలలో ఇలా అంటుంటాం. ◆

పాఠక స్పందన

హృదయ స్పందన కలిగించిన 'మానవతామూర్తి'

జులై 20, 2003 ఆదివారం అనుబంధంలో రియల్ స్టోరీ శీర్షికన ప్రచురించిన 'మానవతా మూర్తి' నిజంగా మాతృ హృదయం స్పందించే విధంగా, కన్నతల్లి ఆశలు ఫలించే విధంగా ఉంది. ఇంతమంచి శీర్షిక మా కందించిన ప్రజాశక్తికి ఇవే నా అభివందనాలు. కవర్ స్టోరీ కూడా బాగుంది.

- మేడూరి సత్యనారాయణ, తిరువూరు, కృష్ణాజిల్లా; **ప్రతిభ**, నల్గొండ

ముఖచిత్రం బాగుంది

జులై 20, 2003 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన కవర్ స్టోరీ ముఖచిత్రం అద్భుతంగా ఉంది. కవర్ స్టోరీ కథనం కూడా చాలా బాగుంది. రాష్ట్రంలో విజృంభిస్తున్న విషజ్వరాల గురించి చక్కగా తెలియజేశారు. విపరీతంగా విషజ్వరాలు వ్యాపిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోక పోవడం ఆశ్చర్యకరంగా వుంది.

- రమణ, రాజమండ్రి

ముగింపు సరిగా లేని కచేరి

జులై 20, 2003 ఆదివారం అనుబంధంలో ప్రచురించిన 'డ్వాక్రా మహిళకో టోక్రా' ముగింపు సరిగా లేదు. రాష్ట్రంలోని ప్రస్తుత పరిస్థితులను కళ్ళకు కట్టినట్లుగా వర్ణించిన రచయిత ముగింపులో డ్వాక్రా మహిళలను చైతన్యవంతం చేసినట్లు చూపారు. కానీ వారు ముఖ్యమంత్రి చేసిన ప్రసంగంపై అసంతృప్తిని ప్రదర్శించటంతో వారిని బయటికి గెంటేశారు. చైతన్యవంతులైన మహిళలు ముఖ్యమంత్రి చేష్టలను ప్రతిఘటించాలి. కాని ముగింపులో అటువంటి సందర్భం లేకుండా అందరూ బయటికెళ్ళిపోవడం సరిగా లేదు.

- నారాయణ, దేవదాయపల్లి.

విద్యార్థి, ఉద్యోగార్థుల సమాచార మార్గదర్శి

- పాఠశాల విద్యార్థులకు 'ప్రిపరేషన్' పాఠాలు
- విద్యార్థులకు కొత్త కోర్సుల అడ్మిషన్‌లు
- ఉద్యోగార్థులకు 'ఎంప్లాయ్‌మెంట్ ఆపార్చునిటీస్'
- 'కంప్యూటర్ ఛానెల్'లో ఐ.టి. న్యూస్
- విద్యావేత్త ఐఐటి రామయ్యగారి 'కౌన్సిలింగ్'
- 'వ్యక్తిత్వవికాసం'/మ్యాథ్స్ స్కిల్స్...... ఇలా అందరికీ అవసరమైన సమాచారమందించే ఏకైక విద్యా ఉద్యోగ వారపత్రిక
- అమూల్యమైన ఈసమాచారం అతి స్వల్పధరకే

దీపిక చందా వివరాలు :

సంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 150లు, పోస్టుద్వారా రూ. 160 లు
అర్ధసంవత్సర చందా: ఏజెంటు ద్వారా రూ. 80లు, పోస్టుద్వారా రూ. 85 లు

మీ అడ్రసు తెలుపుతూ చందాలను ఎం.ఓ/డి.డి. రూపంలో పంపించగలరు.

మా అడ్రసు : 1-1-298/4, స్ట్రీట్‌నెం. 1, అశోక్‌నగర్, హైదరాబాద్-20, ఫోన్ : 7665420, 7663761, మేనేజర్ : 7673787, ఫ్యాక్స్ : 763921, **website : www.prajasakti.com, e-mail : prajasakti@hotmail.com**

చందాదారులుగా చేరండి సమాచారం మీముంగిట నిలుస్తుంది

ఇక అంతా మంచినీళ్ళప్రాయమే!

ఇంటర్వ్యూకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఇ-మెయిల్ పంపాలంటే ఇంగ్లీష్!
కంప్యూటర్ నేర్చుకోవాలంటే ఇంగ్లీష్!
కాంపిటెటివ్ ఎక్జామ్స్ వ్రాయాలంటే ఇంగ్లీష్!
విదేశాలకు వెళ్ళాలంటే ఇంగ్లీష్!
ఎక్కడ చూసినా ఇంగ్లీష్.. ఇంగ్లీష్.. ఇంగ్లీష్..

"నేను ఎన్నో విధాల ప్రయత్నించి చూసాను. కాని నేను మాత్రం ఇంగ్లీషులో సరిగ్గా మాట్లాడలేకపోతున్నాను. ఏదైనా తప్పుగా మాట్లాడేస్తానేమో అని భయంగా వున్నది".

ఇదేనా మీ ప్రాబ్లమ్...? NO PROBLEM !

మీచేత సరళంగా ఇంగ్లీషులో మాట్లాడించటానికి సులభమైన ఫార్ములా కనిపెట్టాం. అవును, **'స్పీచ్ జనరేటింగు ఫార్ములా' SGF™** పద్ధతిలో మేము తయారుచేసిన **స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్** పాఠాలను రోజూ అరగంట చదివి ప్రాక్టీసు చేస్తే చాలు.

వ్యాకరణ దోషం లేకుండా వాక్యాలను రూపొందించి వ్రాయటం నేర్చుకొని ఇంగ్లీషులో తడబడకుండా సరళంగా మాట్లాడటానికి మీవల్ల అవుతుంది. ఇప్పటికే **15** లక్షల మంది ఈ శిక్షణ ద్వారా ఫలితం పొందారు.

ఇంకా ఏంటి ఆలోచిస్తున్నారు?

వెంటనే క్రింద వున్న కూపను పూర్తిచేసి పంపండి. కోర్సు పాఠాలు **V.P.P.** ద్వారా మీ ఇంటిని వెతుక్కుంటూ వస్తాయి. పోస్ట్‌మేన్ వద్ద **రూ. 395/-** చెల్లించి పాఠాలను తీసుకోండి.

ప్రతిరోజూ అరగంట పాఠాలు చదివి ప్రాక్టీసు చెయ్యండి, ఇంగ్లీషులో గడగడమని మాట్లాడండి.

ఇదిగో కూపన్

Yes, నేను అరగంట సమయం కేటాయించి ఇంగ్లీషు నేర్చుకోవాలని ఆశిస్తున్నాను. నాకు కోర్సు పాఠాలను **V.P.P.** ద్వారా వెంటనే పంపండి. పోస్టుమేన్ వద్ద **రూ. 395/-** చెల్లించి తీసుకుంటాను.

పేరు: ....

చిరునామా: ....

....

.... PIN ....

పాఠాలతో పాటు 416 పేజీల ఇంగ్లీష్-తెలుగు డిక్షనరీ ఉచితంగా పొందండి.

VIVEKANANDA INSTITUTE

PSKT

9 (T), Madley Road, T.Nagar, Chennai - 600 017.

వివేకానంద ఇన్‌స్టిట్యూట్
స్పోకన్ ఇంగ్లీష్ ట్రైనింగ్ కోర్స్
ఇక ఇంగ్లీష్ మంచినీళ్ళప్రాయమే!

వివేకానంద ఇన్‌స్టిట్యూట్‌యొక్క ప్రత్యక్ష శిక్షణ కేంద్రాలు: HYDERABAD: (•S.R.NAGAR ☎23714330. •MEHDIPATNAM ☎ 55585223. •DILSUKHNAGAR ☎24044352. •KUKATPALLY ☎ 55341431. •VANASTHALI PURAM ☎24122464) •RAJAHMUNDRY ☎2422003. •KHAMMAM ☎227698 •KAKINADA☎2386638. •VIJAYAWADA ☎ 2630053. •THIRUPATI ☎2252878. •CUDDAPAH ☎224445. •KURNOOL ☎228770. •NELLORE☎2327702 •GUNTUR ☎2238541. •VISAKHAPATNAM☎2738892. •NIZAMABAD☎235767. •BHIMAVARAM☎229125. •KARIMNAGAR☎2234883 •WARANGAL☎ 2578946. •MIRYALGUDA☎230130. •ANANTAPUR.